విశాఖపట్టణం
సోమవారం 17 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:205 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# ఎయిర్ పోర్టుకు రెండు రూట్లు


### ఉదయం 4.30 నుంచి రాత్రి 10.30 వరకు సర్వీసులు

### పాతగాజువాక నుంచి ఎయిర్ పోర్టుకు రూ. 400 చార్జీలు

**(విశాఖపట్నం - జయజయహే)**



అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏరో ఎక్స్‌ప్రెస్ ఎలక్ట్రిక్ బస్సులు రాకపోకలు సాగనున్నాయి. విశాఖపట్నం జిల్లా గాజువాక నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల సౌకర్యార్థం ఏరో ఎక్స్‌ప్రెస్ పేరుతో ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను ఈ నెల 17వ తేదీ నుంచి అందుబాటులోకి ..మిగతా 2లో



### మావోలపై నిషేధం

# ఎత్తివేత..?

### రంగంలోకి అగ్రనేతలు దేవ్ జీ

### హోంమంత్రి అమిత్ షాతో బేటీకి యత్నాలు

### మద్దతు పలుకుతున్న ప్రజా సంఘాలు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

సీపీఐ (మావోయిస్టు) పార్టీపై నిషేధాన్ని ఎత్తివేయాలని మాజీ మావోయిస్ట్ అగ్రనేతలు కోరుతున్నారు. ఇదే విషయంపై తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ.. తన సహచర నేతలతో కలిసి చర్చలు జరుపుతున్నారు. కలిసివచ్చే మాజీ సహచరులతో కలసి ప్రజల సమస్యలపై చట్టబద్ధంగా, బహిరంగంగా పనిచేయడానికి వీలుగా సీపీఐ (మావోయిస్టు) పార్టీపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని కోరే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే విషయంపై కేంద్ర హోంశాఖ మంత్రి ..మిగతా 2లో

# సభా సమరం..!

### నేటి నుంచి అసెంబ్లీ

### వైసీపీ హాజరుపై అస్పష్టత

### మండలిలో డీఎస్సీపై చర్చించే ఛాన్స్

**(అమరావతి - జయజయహే)**

అమరావతిలోని వెలగపూడి వద్ద గల అసెంబ్లీ భవనంలో సోమవారం ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఇక శాసనమండలి భవనంలో ఉదయం 10 గంటలకు మండలి సమావేశాలు కొలువుదీరనున్నాయని రాజ్ భవన్ జారీ చేసిన ప్రకటనలో అధికారులు వెల్లడించారు. ఈ రాబోయే సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇటీవలనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లతో పాటు సభ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను చట్టసభల వేదికగా ఎండగట్టాలని వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పార్టీ ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు.




ఆగస్టు 12న నిర్వహించిన సమావేశంలో ఆయన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మాట్లాడారు. ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై పూర్తి డేటాతో సభకు వచ్చి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సభలో ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ ఉన్నప్పటికీ, తమకు 'ప్రతిపక్ష నేత' హోదా ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిరాకరిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. విపక్షం గొంతు నొక్కేందుకే ఈ కుట్రలు చేస్తున్నారని, అయితే ప్రభుత్వం చేస్తున్న తప్పులను మీడియా ద్వారా ప్రజలకు నిరంతరం వివరిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాల్లో చోటుచేసుకున్నాయంటున్న అక్రమాలు, ఔట్‌సోర్సింగ్ నియామకాల స్కామ్‌లు, ఇతర ప్రజా సమస్యలపై సభలో తీవ్రంగా నిలదీయాలని జగన్ తమ శాసనసభ్యులను ఆదేశించారు. ఈ అంశాలపై చర్చకు పట్టుబట్టాలని దిశా నిర్దేశం చేశారు. అలాగే రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. ఏ ఒక్క పంటకూ కనీస మద్దతు ధర లభించడం లేదని, సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉచిత పంటల బీమా పథకాన్ని నిలిపివేయడం వల్ల రైతాంగం మరింత నష్టపోయిందని, ఈ సమస్యలను సభలో గట్టిగా వినిపించాలని పిలుపునిచ్చారు.

**ఎమ్మెల్యేల హాజరుపై ఉత్కంఠ**

శాసనసభలో తమ పార్టీ సభ్యులు కొద్దిమందే ఉన్నప్పటికీ... శాసనమండలిలో వైఎస్ఆర్‌సీపీకి ..మిగతా 2లో

# రైతులపై ఏనుగుల గుంపు దాడి

### గుంపుగా హల్ చల్ చేస్తూ పంటలు ధ్వంసం

### రంగంలోకి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

### హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం


### చంద్రగిరి అడవుల్లో అప్రమత్తం

**(చిత్తూరు - జయజయహే)**

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని యర్రావారిపాలెం, చంద్రగిరి మండలాల్లో సుమారు 30 ఏనుగులతో కూడిన గుంపు హల్‌చల్ చేస్తూ గ్రామస్తులను, రైతులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. మూలపల్లి గ్రామంలో పంట పొలాలపై బడి దాడి చేసిన ఈ ఏనుగులు కొబ్బరి, వరి, టమోటా, పశుగ్రాసం పంటలను ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో ఏనుగులను అడ్డుకోవడానికి ప్రయత్నించిన కేశవరెడ్డి అనే రైతుపై దాడి జరగడంతో ఆయన చెయ్యి విరిగి తీవ్రగాయాలపాలయ్యారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఈ ఏనుగుల గుంపు మూలపల్లి చెరువు ప్రాంతంలో తిష్టవేసింది. చంద్రగిరి, యర్రావారిపాలెం, భాకరాపేట, తలకోన అటవీ ప్రాంతాల్లో ఇవి ..మిగతా 2లో







# బంగాళాతంలో వాయుగుండం

### బలపడనున్న అల్పపీడనం

### ఉత్తరాంధ్రకు ఈదురు గాలులు ముప్పు

**(విశాఖపట్నం - జయజయహే)**

వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ -- ఉత్తర ఒడిశా తీరప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి స్పష్టమైన అల్పపీడనంగా కొనసాగుతోంది. ఇది రాబోయే 24 గంటల్లో వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో వాయవ్య, ..మిగతా 2లో



# డిఎస్సీలో అక్రమాల్లేవు

### వైసీపీ ఆరోపణలు అవాస్తవం

### కదంతొక్కిన డిఎస్సీ విజేతలు

### విజయవాడలో బారీ ర్యాలీ

**(విజయవాడ -- జయజయహే)**

మెగా డీఎస్సీపై అధికార కూటమి పార్టీలు, వైసీపీ నేతల మధ్య విమర్శలు, ఆరోపణలు కొనసాగుతున్నాయి. డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, పారదర్శకంగా టీచర్ పోస్టులను భర్తీ చేశామని సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహా మంత్రులు చెబుతున్నారు. కానీ మెగా డీఎస్సీ ..మిగతా 2లో

# శ్రావణం దెబ్బ..!

### చికెన్ ధరలు తగ్గుముఖం... అదే దారిలో గుడ్డు రేట్లు



**(విజయవాడ - జయజయహే)**

శ్రావణ మాసం రాకతో చాలామంది నాన్ వెజ్ వంటకాలకు దూరంగా ఉంటున్నారు. శ్రావణ మాసంలో చాలామంది నాన్ వెజ్ తినరు. మళ్లీ శ్రావణ మాసం పూర్తయిన తర్వాత తినడం మొదలుపెడతారు. దీని ప్రభావంతో ఈ మాసం వచ్చిందంటేనే.. చికెన్, కోడి గుడ్లకు డిమాండ్ భారీగా తగ్గిపోతూ ఉంటుంది. దీని వల్ల వీటి ధరలు పడిపోతూ ఉంటాయి. ఈ సారి కూడా అదే జరిగింది. శ్రావణ మాసం రాకతో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు పడిపోయాయి. గత నెలలో కిలో చికెన్ రూ.350 వరకు చేరుకోగా.. ఒక్కో గుడ్డు ధర రూ.8 వరకు చేరుకుంది. కానీ ఇప్పుడు చికెన్‌తో పాటు గుడ్ల ధరలు కూడా పడిపోయాయి. గత కొద్ది రోజులలో ఈ రెండింటి ధరలు భారీగా పతనమయ్యాయి. ఆదివారం చికెన్, కోడి గుడ్ల ధరలు ఎలా ఉన్నాయంటే..

**చికెన్ ధరలు తగ్గుముఖం**

ఆగస్ట్ 16న కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.222 పలుకుతుండగా.. ..మిగతా 2లో

# మహిళలకు వంచన, దగా రెట్టింపు

### ఎన్నికల్లో డబ్బులు పంచలేదా..?

### చంద్రబాబు ప్రమాణం చేయగలరా ?

### ప్రశ్నించిన వరుదు కళ్యాణి

**(విశాఖపట్నం - జయజయహే)**



ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు దగాను, వంచనను మాత్రమే రెట్టింపు చేశారని, మహిళల ఆత్మగౌరవాన్ని రెట్టింపు చేయలేదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖలోని వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం నాడు డ్వాక్రా, ఉచిత బస్సు మహిళలతో ..మిగతా 2లో

# మావోలపై నిషేధం ఎత్తివేత..?

మొదటి పేజీ తరువాయి...

అమిత్ షాకు విజ్ఞప్తి పంపాలని భావిస్తున్నారు. లొంగిపోయిన మాజీ మావోయిస్టు నేతలు ఇటీవల తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసి తమ వినతులను సమర్పించారు. చనిపోయిన తమ పాత సహచరుల కుటుంబాలను పరామర్శించడం, చిన్న తరహా సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టినప్పుడు పోలీసుల నుంచి ఆంక్షలు ఎదురుకాకుండా చూడాలని కోరారు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ, రహస్య లేదా సాయుధ కార్యకలాపాలకు పాల్పడబోమని, అయితే తమపై అనుమానాలు వ్యక్తం చేసే అవకాశం ఉన్నందున ముందస్తుగా పోలీసు యంత్రాంగానికి స్పష్టతనిచ్చామని దేవ్‌జీ పేర్కొన్నారు. "ప్రజా సమస్యలపై పనిచేసే ఏ వేదికైనా రాజకీయ పార్టీయే అవుతుంది. నిషేధం ఎత్తివేస్తే ఇప్పటికే ఉనికిలో ఉన్న సీపీఐ (మావోయిస్టు) పార్టీ పతాకం కిందే బహిరంగంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని దేవ్‌జీ స్పష్టం చేశారు.



**కేంద్రానికి దరఖాస్తు**

లొంగిపోయిన నాయకులు ప్రజాక్షేత్రంలోకి వచ్చి పనిచేయడానికి వీలుగా పార్టీపై నిషేధం తొలగించాలని కేంద్రానికి దరఖాస్తు పంపే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. డీజీపీని కలిసిన సందర్భంగా ఆయన నుంచి సానుకూల స్పందన లభించిందని, తాము చేపట్టబోయే కార్యాచరణ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలోని సాధారణ రాజకీయ పార్టీల తీరుకు భిన్నంగా, కేవలం ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉంటుందని వివరించారు. నాలుగు దశాబ్దాలకు పైగా అజ్ఞాతంలో గడిపిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ మావోయిస్టు పార్టీలో కీలక వ్యూహకర్తగా, మిలిటరీ కమాండర్‌గా సేవలందించారు. నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్నత బాధ్యతలు నిర్వర్తించిన ఆయన.... ఈ ఏడాది ఫిబ్రవరిలో మరో అగ్రనేత మల్లా రాజిరెడ్డితో కలసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రధానంగా ఆరోగ్య సమస్యల కారణంగానే అజ్ఞాత జీవితాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసినట్లు అప్పట్లో ఆయన ప్రకటించారు. "ఆరోగ్య దృష్ట్యా అజ్ఞాత జీవితానికి స్వస్తి చెప్పాను. నా సిద్ధాంత భావజాలానికి కట్టుబడి, చట్టబద్ధమైన చట్రంలోనే ఉంటూ ప్రజా సమస్యలపై నా పోరాటం కొనసాగిస్తాను" అని ఆ సమయంలో తేల్చిచెప్పారు. మాజీ సభ్యులు ప్రజల కోసం పనిచేయాలనుకున్నప్పుడు నిషేధిత సంస్థ పేరును ఎలా ఉపయోగిస్తారనే అంశంపై ఒక సీనియర్ తెలంగాణ పోలీసు అధికారి స్పందించారు. చట్టబద్ధమైన పరిధికి లోబడి ఎవరైనా తమ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.




# డిఎస్సీలో అక్రమాల్లేవు

మొదటి పేజీ తరువాయి...

కాదని, దగా డీఎస్సీ అని.. టీచర్ పోస్టుల భర్తీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు ఎప్పటికప్పుడూ సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో డీఎస్సీ 2025 విజేతలు ప్రభుత్వానికి మద్దతుగా విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, పారదర్శకంగా రిక్రూట్‌మెంట్ జరిగిందని వైఎస్ జగన్ వీరాభిమాని చెప్పడం హాట్ టాపిక్ అయింది. డీఎస్సీ 2025లో ఎంపికైన ఉపాధ్యాయులు వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారం చేస్తుందంటూ, వారి ఆరోపణలకు వ్యతిరేకంగా విజయవాడ నగరంలో భారీ ఆత్మగౌరవ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన స్వరాజ్ మైదాన్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. తమది ప్రతిభ ఆధారంగా సాధించిన మెగా డీఎస్సీ అని, పోస్టుల భర్తీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని స్పష్టం చేస్తూ టీచర్లు నినాదాలతో హోరెత్తించారు. వైఎస్సార్సీపీ నేతలు తమ ప్రతిభను కించపరిచేలా బురదచల్లడం మానుకోవాలని, లేకపోతే రాబోయే రోజుల్లో పాఠాలతో పాటు రాజకీయ గుణపాఠాలు కూడా చెబుతామని ప్లకార్డులు పట్టుకుని హెచ్చరించారు. అహర్నిషలు శ్రమించి, ఎంతో కష్టపడి ఉద్యోగాలు సాధించిన తమపై విషప్రచారం ఆపాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ ర్యాలీలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు పాల్గొని తమ నిరసన తెలిపారు. ఓ అభ్యర్థి మాట్లాడుతూ.. మెగా డీఎస్సీలో తాను స్కూల్ అసిస్టెంట్ గా సెలక్ట్ అయ్యానని తెలిపారు. తాను చిన్నప్పటి నుంచి వైఎస్ జగన్ వీరాభిమానినని, వాట్సాప్ డీపీ కూడా జగన్ ఫొటోనే ఉంటుందన్నారు. తాను టీడీపీ కార్యకర్త, అభిమానిని కాదని.. ఎంతో కష్టపడి జాబ్ తెచ్చుకుంటే మా ఉద్యోగాలను అవమానించారు. కనుక ఈరోజు నుంచి నేను జగన్ అభిమానిని కాదని పేర్కొన్నారు. ఓ అబద్ధాన్ని వంద సార్లు చెబితే నిజమైపోతుందని అంతా నమ్ముతారు. కానీ వైసీపీ చేసిన ఆరోపణల్లో నిజం లేదని డీఎస్సీ 2025 విజేతలు అన్నారు. ఇది దగా డీఎస్సీ కాదని, మెగా డీఎస్సీ అని.. ఎంతో శ్రమించి తెచ్చుకున్న జాబ్స్ అని స్పష్టం చేశారు. అన్నా క్యాంటీన్లలో తిని కడుపు నింపుకుని ప్రిపేర్ అయి టీచర్ జాబ్ తెచ్చుకున్నానని ఓ అభ్యర్థి తెలిపారు. వైసీపీ హయాంలో నోటిఫికేషన్లు రాలేదని, కూటమి ప్రభుత్వం రాగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి పారదర్శకంగా పోస్టులను భర్తీ చేశారని పేర్కొన్నారు. భార్యా పిల్లల్ని దూరం చేసుకుని మరీ చదువుకుని ఉద్యోగాలు సాధించిన మమ్మల్ని అవమానిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# బంగాళాతంలో వాయుగుండం

మొదటి పేజీ తరువాయి...

పశ్చిమ-మధ్య బంగాళాఖాతంతో పాటు ఉత్తరాంధ్ర తీరప్రాంతాల్లో మంగళవారం వరకు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. సముద్రం తీవ్ర అలజడిగా మారి అలలు భారీగా ఎగసిపడే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారు తక్షణమే తీరానికి చేరుకోవాలని సూచించారు.

**రానున్న రెండు రోజుల వర్ష సూచన**

సోమవారం పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పోలవరం, ఏలూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, మార్కాపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురుస్తాయి. మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాగా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, వర్షం, పిడుగులు పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఆశ్రయం పొందవద్దని అధికారులు హెచ్చరించారు.

# రైతులపై ఏనుగుల గుంపు దాడి

మొదటి పేజీ తరువాయి...



సంచరిస్తుండటంతో అటవీశాఖ అధికారులు వాటిని తిరిగి దట్టమైన అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు చర్యలు చేపట్టారు. గ్రామస్తులు ఎవరూ ఏనుగుల జోలికి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయితే, తరచూ ఎదురవుతున్న ఈ సమస్యకు కుంకీ ఏనుగుల సహాయంతో శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తిరుపతి జిల్లా చంద్రగిరి సమీప ప్రాంతాల్లోని ఎర్రవారిపాలెం వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని, ధైర్యం చెప్పాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, డ్రోన్ల సహాయంతో వాటి సంచార మార్గాలను గుర్తించి సమీప గ్రామాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. శేషాచలం అటవీ ప్రాంతంలోని ఏనుగులు 2 గుంపులుగా సంచరిస్తూ రాత్రివేళ అటవీ సరిహద్దుల్లోని పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయని తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అటవీశాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ ప్రత్యేక గస్తీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలు రాత్రివేళ పొలాలకు వెళ్లకుండా అవగాహన కల్పించి, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఏనుగుల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో మైకులు, మొబైల్ సందేశాలు, స్థానిక సమాచార వ్యవస్థల ద్వారా హెచ్చరికలు జారీ చేయాలన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట హనుమాన్ బృందాలను మోహరించడంతో పాటు క్షేత్ర స్థాయి సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా అటవీశాఖ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. ఏనుగులు పంట పొలాలపై దాడి చేసి పంటలను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో, పంట నష్టంపై అధికారులు నివేదికలు రూపొందించిన వెంటనే అటవీశాఖ ద్వారా తక్షణ పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# మహిళలకు వంచన, దగా రెట్టింపు

మొదటి పేజీ తరువాయి...

చంద్రబాబు నిర్వహించిన తేనీటి విందు మహిళల సమస్యలకు సమాధానం చెప్పే కార్యక్రమం కాదని, ఒక పచ్చి 'పబ్లిసిటీ స్టంట్' అని విమర్శించారు. ఎన్నికలకు ముందు మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా, ఇప్పుడు అదే మహిళలకు నీతులు చెప్పడం చంద్రబాబు మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.18 వేల ఆర్థిక సాయం, ఆడబిడ్డ నిధి, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు, నిరుద్యోగ భృతి, 3 సెంట్ల స్థలం, ఇళ్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీలను ఏమి చేశారో చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం, జూన్ నుంచే లెక్కవేసుకున్నా ఈ 25 నెలల కాలానికి మహిళలకు చంద్రబాబు ప్రభుత్వం బాకీ పడిన మొత్తం అక్షరాలా రూ. 1,80,000 కోట్లు. ఇంత భారీ మొత్తాన్ని ఎగనామం పెట్టి, ఏదో రూ. 3,000 కోట్లు ఇచ్చేశానని పచ్చి అబద్ధాలు చెబుతారా? ఆ మూడు వేల కోట్లు ఏ అకౌంట్లో వేశారో తక్షణం సమాధానం చెప్పాలి. మహిళలు రూ. 2 వేలు తీసుకుని ఓట్లు వేస్తున్నారని, వారికి ప్రశ్నించే నైతిక హక్కు లేదని చంద్రబాబు మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనం. అసలు ఈ దేశంలో 'ఓటుకు నోటు' సంస్కృతిని తెచ్చిందే చంద్రబాబు కదా? నాడు తెలంగాణలో ఎమ్మెల్యేలను కొంటూ దొరికిపోయి, హైదరాబాద్ లాంటి ఉమ్మడి రాజధానిని, 2 లక్షల కోట్ల ఆస్తులను వదిలేసి పిరికివాడిలా పారిపోయి వచ్చింది మీరు కాదా? వేల కోట్లు దోచుకుంటున్న చంద్రబాబు మహిళలను లంచగొండులు అనడం సిగ్గుచేటు అని వరుదు కల్యాణి మండిపడ్డారు.

# సభా సమరం..!

మొదటి పేజీ తరువాయి...

పూర్తి మెజారిటీ ఉందనే విషయాన్ని జగన్ గుర్తుచేశారు. ప్రజల గొంతుకగా మారి ప్రతి సమస్యను మండలి వేదికగా గట్టిగా లేవనెత్తాలని ఎమ్మెల్సీలకు సూచించారు. అయితే... వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యేలు శాసనసభ సమావేశాలకు హాజరవుతారా లేదా అనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదు. మరోవైపు ఆ పార్టీ ఎమ్మెల్సీలు మాత్రం మండలి సమావేశాలకు హాజరు కావడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.



# శ్రావణం దెబ్బ..!

మొదటి పేజీ తరువాయి...

డ్రెస్సిడ్ చికెన్ రూ.197కి చేరుకుంది. ఇక రిటైల్ లైవ్ బర్డ్ రూ.127గా ఉండగా.. ఎక్స్ ఫారం లైవ్ బర్డ్ రూ.100 వద్ద కొనసాగుతోంది. ఇక వరంగల్ డివిజన్‌లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. అటు విజయవాడ జోన్ పరిధిలో కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.240 వద్ద పలుకుతుండగా.. డ్రెస్సిడ్ చికెన్ రూ.212, రిటైల్ లైవ్ బర్డ్ రూ.137, ఫారం దగ్గర లైవ్ బర్డ్ రూ.110గా ఉంది. ప్రాంతాలను బట్టి చికెన్ ధరల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. స్థానిక ఫామ్స్, రవాణా ఖర్చుల ఆధారంగా ధరల్లో మార్పులు ఉంటాయి.

**కోడి గుడ్ల ధరలు ఇలా..**

విజయవాడ జోన్ పరిధిలో 12 గ్రుడ్ల రిటైల్ ధర రూ.75గా కొనసాగుతోంది. ఇక హైదరాబాద్, కరీంనగర్ జోన్ పరిధిలో రూ.74గా ఉంది. శ్రావణ మాసం రాకతోనే ధరలు తగ్గినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ మాసం పూర్తయ్యేవరకు ధరలు ఇలాగే కొనసాగుతాయని, మరింత తగ్గే అవకాశముందని షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. కోళ్లకు డిమాండ్ తగ్గడంతో ధరలు కూడా తగ్గుముఖం పట్టినట్లు చెబుతున్నారు. దీంతో తమకు ఆదాయం కూడా తగ్గిపోతుందని ఆవేదన చెందుతున్నారు. అయితే గత నెలలో చికెన్ ధర రూ.340కి చేరుకోగా.. ఇప్పుడు రూ.240 పలుకుతుంది. కొద్ది రోజుల్లోనే రూ.100 మేర పడిపోయింది. రానున్న రోజుల్లో మరికొంత తగ్గే అవకాశాలున్నట్లు ఫామ్స్ నిర్వహకులు చెబుతున్నారు



# ఎయిర్ పోర్టుకు రెండు రూట్లు

మొదటి పేజీ తరువాయి...

తీసుకురానున్నట్లు విశాఖపట్నం రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు గారు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం అల్లూరి ఎయిర్ పోర్టు -1 మరియు అల్లూరి ఎయిర్ పోర్టు -2 పేర్లతో రెండు మార్గాల్లో బస్సులను నడపనున్నారు. ఈ రెండు మార్గాల్లో ప్రతి అరగంటకు ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని, బస్సులు ఉదయం 4:30 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు నడుస్తాయని రీజినల్ మేనేజర్ తెలిపారు.

ఎఎస్ ఆర్ ఎయిర్ పోర్టు - రూట్ 1:

గాజువాక -- ఎన్ ఏ డీ -- గురుద్వార్ -- జూ పార్క్ -- మారికవలస -- ఆనందపురం -- తగరపువలస -- ఏర్పాటుజంక్షన్ -- అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం.

ఎఎస్ ఆర్ ఎయిర్ పోర్టు - రూట్ 2

గాజువాక -- సింధియా -- రైల్వే స్టేషన్ -- బస్ స్టేషన్ -- సిరిపురం -- ఇస్కాన్ టెంపుల్ -- ఐటీ హిల్స్ -- మారికవలస -- ఆనందపురం -- తగరపువలస -- ఏర్పాటుజంక్షన్ -- అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం.

**ప్రయాణ ఛార్జీలు**

రూట్ 1 :
- పాత గాజువాక నుంచి విమానాశ్రయం -- ₹400
- ఎన్ ఏడీ నుంచి విమానాశ్రయం -- ₹350
- గురుద్వార్ నుంచి -- ₹300
- జూ పార్క్ నుంచి -- ₹250
- మారికవలస నుంచి -- ₹200
- ఆనందపురం నుంచి -- ₹150
- తగరపువలస నుంచి -- ₹100
- ఎయిర్ పోర్టు జంక్షన్ నుంచి -- ₹50

ూూ=-2 రూట్:
- పాత గాజువాక నుంచి విమానాశ్రయం -- ₹400
- సింధియా నుంచి -- ₹400
- కంచరపాలెం నుంచి -- ₹400
- సిరిపురం నుంచి -- ₹350
- ఇస్కాన్ టెంపుల్ నుంచి -- ₹300
- ఐటీ హిల్స్ నుంచి -- ₹250
- మారికవలస నుంచి -- ₹200
- ఆనందపురం నుంచి -- ₹150
- తగరపువలస నుంచి -- ₹100
- ఎయిర్ పోర్టు జంక్షన్ నుంచి -- ₹50

# నేడు విశాఖకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

## పర్యటన వివరాలు వెల్లడించిన బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్

**విశాఖపట్నం, ఆగస్టు 16, జయ జయహే :**

బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సోమవారం విశాఖకు రానున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పర్యటన వివరాలను వెల్లడించారు. ఈనెల 17న సాయంత్రం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ వస్తున్నారని, 18 న నూతన కార్యకవర్గ సమావేశం జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా మండల స్థాయి నాయకులు అంతా పాల్గొంటారని, అయితే ఈ సమావేశాల్లో రెండు ప్రధానమైనటువంటి తీర్మానాలను ప్రవేశ పెడతామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతి, ఒకటి.. నీటిపారుదల ప్రాజెక్టులపై రెండో తీర్మానం పెడతామని చెప్పారు. నితిన్ అధ్యక్షతన



జరిగే ఈ మీటింగ్ కు బీఎల్ సంతోష్ సైతం వస్తున్నారని, డబుల్ ఇంజన్ ప్రభుత్వం, త్రిబుల్ ఇంజన్ గ్రోత్ రాష్ట్రంలో చూపిస్తున్నామని చెప్పారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో విశాఖకు 25 శాతానికి పైగానే పెట్టుబడులు వస్తున్నాయని, పోలవరం ప్రాజెక్ట్ ప్రధాని నరేంద్ర మోడీ వరంగా భావిస్తున్నామని వెల్లడించారు. మరో వారంలో గోదావరి నీరు ఉత్తరాంధ్ర నేలని తాకబోతున్నాయని, గూగుల్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, గ్రీన్ హైడ్రోజన్, బల్క్ డ్రగ్ పార్క్ వస్తున్నాయని, ఇలాంటి తరుణంలో మా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రావటం సంతోషంగా ఉందన్నారు. విశాఖ ఎయిర్పోర్ట్ మూసివేత ఈ ప్రాంత వాసిగా నాకు కొంత బాధ ఉంది...కానీ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని.. మనం భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మించుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, నగర అధ్యక్షుడు పరశురామ రాజు తదితరులు పాల్గొన్నారు.



## బీసీల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న కృషి చిరస్మరణీయం

### జయంతి వేడుకలో నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, ఆగస్టు 16, జయ జయహే**

సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం సర్దార్ గౌతు లచ్చన్న చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆదివారం గ్రీన్ పార్క్ హోటల్ జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లచ్చన్న అందించిన సేవలను స్మరించుకున్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ గౌతు లచ్చన్న చేసిన పోరాటం, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, బీసీ సంఘాల నాయకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళులర్పించారు.




## ఉత్తమ విద్యార్థులకు వెండి పతకాలు బహుకరణ

**శ్రీకాళహస్తి, ఆగస్టు 16,జయ జయహే.**


పట్టణంలోని ది స్కూలు లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు వెండి కాయిన్స్ అందించినట్లు కరెస్పాండెంట్ జనార్దన్ రావు జె. పవార్ తెలిపారు. 594 మార్కులు సాధించిన ఎం. రితిక కి 30 గ్రాముల వెండి కాయిన్, అలాగే ఎ. భవిత 589 , ఎం. అగస్త్య సాయి 588, కె.చరణ్ 581 మార్కులు సాధించిన వీరికి ఒకొక్కరికి 20 గ్రాముల వెండి కాయిన్స్, దుశ్శాలువతో సన్మానించినట్లు వివరించారు. పట్టణంలో ఉత్తమ మార్కులు సాధించడానికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయ బృందాన్ని నగదు బహుమతితో సత్కరించడం జరిగిందన్నారు. పట్టణంలో క్రమశిక్షణ కూడిన, భవిష్యత్తుకు అవసరమైన సాంకేతిక విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ఉత్తమ సబ్ రిజిస్ట్రార్‌గా గీతా లక్ష్మీ

**చోడవరం ఆగస్టు 16 జయ జయహే**

అనకాపల్లి జిల్లాలో ఉత్తమ సబ్ రిజిస్ట్రార్ గా బి గీతా లక్ష్మి ఉత్తమ అధికారి అవార్డు అందుకున్నారు. శనివారం అనకాపల్లిలో జరిగిన మారుత 8శీవ స్వాతంత్ర దినోత్సవాలు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హోం మంత్రి వి అనిత ఆమెను అభినందిస్తూ ప్రశంస పత్రం జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా గీతా లక్ష్మి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గీత లక్ష్మీదేవి వద్దమ్మా అధికారి అవార్డు రావడం పట్ల చోడవరం కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు, చోడవరం కమ్యూనిటీ సద్భావ టీం అభినందనలు తెలిపాయి.



## కమ్మకొత్తూరులో మట్టి తవ్వకాలు


**శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 16,జయ జయహే**

కమ్మకొత్తూరు గ్రామ పరిధిలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఆదివారం సెలవు రోజును అదునుగా చేసుకుని రెండు జేసీబీలతో మట్టిని తవ్వి తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.మట్టి తవ్వకాల వల్ల భూముల స్వరూపం మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? లేదా అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు.

## అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ నియామకానికి దరఖాస్తు చేసుకోండి

**మాడుగుల ఆగస్టు 16 జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా శాఖలో మొత్తం 6,534 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. దాన్ని భాగంగా మాడుగుల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ పండిట్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ లు దేవుడమ్మ ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆఫ్‌లైన్ ద్వారా (సంబంధిత ఎంఈఓ, ఎంఆర్సి కార్యాలయంలో 21 లోగా చేసుకోవాలన్నారు. మెరిట్ ప్రాతిపదికన (అకడమిక్ 75% ం ప్రొఫెషనల్ 25%) ప్రకారం సెప్టెంబర్ ఒకటి నుంచి 2027 ఏప్రిల్ 30 వరకు తాత్కాలిక వేతనంపై పని చేయాల్సి ఉంటదన్నారు. ముఖ్యంగా టెట్, డిఎడ్ కలిగిన స్థానికంగా ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునని పేర్కొన్నారు.





## మహిళా వ్యాపారవేత్తలకు వేదికగా డిజిటల్ మహిళా సంగం బిజినెస్ ఎక్స్‌పో.

**శ్రీకాళహస్తి, ఆగస్టు 16,జయ జయహే.**

డిజిటల్ మహిళా సంగం ఆధ్వర్యంలో మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించే ఉద్దేశంతో రెండు రోజుల బిజినెస్ ఎక్స్‌పోను తిరుపతి పట్టణంలో తిరుచానూరు రోడ్ లోని హోటల్ అవని ఎలైట్లో నిర్వహించారు. శ్రీకాళహస్తిలోని ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం తరపున ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జన ఔషధి కేంద్రం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న నాణ్యమైన మందులు, తక్కువ ధరల్లో లభించే ఔషధాలపై సందర్శకులకు అవగాహన కల్పించారు.ఈ స్టాల్‌లో జన ఔషధి కేంద్రం ఫార్మసిస్ట్ అరుణకుమారి పాల్గొని సందర్శకులకు ఔషధాల లభ్యత, జన ఔషధి కేంద్రం సేవలు తదితర అంశాలను వివరించారు. ఈ క్యాంపు లో విచ్చేసిన సందర్శకులకు ఉచితముగా బీపీ,షుగర్, వైట్ చూసి...జన్ ఔషధ మందుల గురించి అవగాహన కల్పించారుమహిళా వ్యాపారవేత్తలకు తమ ఉత్పత్తులు, సేవలను ప్రజలకు పరిచయం చేసుకోవడంతో పాటు కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఎక్స్‌పో వేదికగా నిలిచింది.మహిళలను గౌరవిద్దాం అభివృద్ధికి స్ఫూర్తినిద్దాం భవిష్యత్తును నిర్మిద్దాంఅనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళా వ్యాపారవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యాపార రంగంలో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించడం, పరస్పరం పరిచయాలు పెంచుకోవడం, ఒకరికొకరు సహకరించుకుంటూ అభివృద్ధి సాధించడం.ఈ ఎక్స్‌పో ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు.



## ఉత్తమ సేవా పథకం అందుకున్న ఎఎస్ఐ సుభాకర్

**రాజమహేంద్రవరం: జయ జయహే:ఆగస్టు 16:**

ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న సుభాకర్ "ఉత్తమ సేవా పథకం--2026" అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా సుభాకర్ మాట్లాడుతూ, "ఈ అవార్డు నాకు మరింత బాధ్యతను పెంచింది. ప్రజలకు నిజాయితీతో, అంకితభావంతో సేవలందిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తాను. ఈ గౌరవానికి కారణమైన ఉన్నతాధికారులకు, సహచర సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తుమ్మపాలలో ఆరోగ్య భారతి

### ఆకట్టుకున్న బాల సౌజన్య ఆరోగ్య ప్రసంగం

**అనకాపల్లి, ఆగస్టు 16, జయ జయహే :**

అనకాపల్లి జిల్లా తుమ్మపాల గ్రామంలో ఆరోగ్య భారతి ప్రశిక్షణ వర్గ ఆదివారం జరిగింది. తమిళనాడు వాస్తవ్యులు డాక్టర్. మురళీకృష్ణ, అనకాపల్లి వాస్తవ్యులు ఆరోగ్య ఆహర ప్రసంగీకురాలు ఆధ్యాత్మికవేత్త ప్రముఖ విద్యావేత్త ఏ. బాల సౌజన్య మాట్లాడుతూ జీవన క్రమ పద్ధతిలో ఎటువంటి ఆహారం తీసుకోవాలి అనే విషయాలను వివరణాత్మకంగా చెప్పారు. రైతు కుటుంబాల్లో రైతులు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల గురించి వైద్యులను ఎటువంటి విధంగా వెంటనే సంప్రదించాలో తెలియజేశారు. జీవన క్రమంలో ఆరోగ్యంగా మనిషి ఎక్కువ కాలం జీవించాలి అంటే కొన్ని విషపూరితమైన తెలుపు రంగు పదార్థాలైన మైదా, షుగర్ ఇతర కొన్ని గ్రూపు పదార్థాలు పూర్తిగా నిష్క్రమించాలి అని చెప్పారు. ఎవరికైనా ఏ సమయంలో అయినా విపరీతమైన ఛాతి మంట వీపునొప్పి చేయి లాగడం తీవ్ర శ్వాస కోసం ఇబ్బందులు ఉంటే వెనువెంటనే వైద్యుల్ని సంప్రదించాలన్నారు. ముఖ్యంగా మహిళ ఆరోగ్యం గురించి మాట్లాడుతూ మహిళలు నెలసరిలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి మరియు క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా ఎటువంటి ఆహార నియమాలు పాటించాలనేటువంటి విషయాలను వివరించారు. వ్యక్తిగతంగా మహిళలు పరిశుభ్రతను ఎలా పాటించాలి...పాటించకపోతే వచ్చేటువంటి అనారోగ్య సమస్యలను చెప్పారు. రోడ్లపై లభించే చిరుతిళ్లు ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ కప్పులు ప్లాస్టిక్ సంచులలో వేడి పదార్థాలు వేసుకుని తినడం పూర్తిగా విరమించుకోవాలి. కాఫీ టీ ప్లాస్టిక్ కప్పుల లో వేసి తాగడం వలన సగటు రోజుకి ఐదు క్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయి అని సౌజన్య వివరించారు. దీనిలో వి.వి.ఎల్ శ్రీనివాస్ ఆంధ్ర ప్రాంత కార్యదర్శి, సూర్య ప్రకాష్ విశాఖపట్నం, సభ్యులు,గోకువాడ శ్రీరాములు బిఎంఎస్, పెనుమటి అప్పారావు ఆరఎసఎస్, చదరం రామరాజు ఆరోగ్య భారతి అనకాపల్లి జిల్లా ఇతర సభ్యులు, ప్రజలు అనేక సంఖ్యలో పాల్గొని ఆరోగ్యం పట్ల ఎటువంటి నియమాలు పాటించాలో తెలుసుకున్నారు.




## బండారుపల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**శ్రీకాళహస్తి, ఆగస్టు 16,జయ జయహే.**

బండారుపల్లి గ్రామంలో జడ్పీ హైస్కూల్ 1988 -89 సంవత్సరంకు సంబంధించి పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలిసి వారి గురువులకు పాదపూజ నిర్వహించి వారి వద్ద నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. వారిని శాలువాలతో సత్కరించి బొకే మేమంటూ అందజేశారు. పూర్వ విద్యార్థులు పలు విభాగాలలో స్థిరపడి ఉన్న అందరూ కూడా విచ్చేసి ఆత్మీయంగా 37 సంవత్సరాల తర్వాత కలుసుకొని ఒకరినొకరు ఆలింగనము చేసుకొని ఒకరికొకరు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఆనందంగా ఉత్సాహభరితమైన వాతావరణంలో ఉల్లాసంగా గడిపి మంచి విందు భోజనం చేశారు. వారు ఆత్మీయ సమావేశం ద్వారా పలు విషయాలు చర్చించుకుంటూ పాఠశాల అభివృద్ధి కోసం ఒక సమగ్రమైన ప్రణాళికతో ముందుకు పోవాలని త్వరలో పాఠశాలకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్పంచుకుంటూ పాఠశాలకు ఒక కార్యక్రమాల నిర్వహణకు ఒక వేదికని తమ వంతుగా 8 -89పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించాలని తీర్మానించుకున్నారు. అంతకుముందు కార్యక్రమంలో గురువులు వసంతమ్మ, రాజశేఖర్ వెంకటరమణలను విద్యార్థులందరూ కలిసి శాలువాలతో సత్కరించి మేమంటు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న 88 బ్యాచ్ కి చెందిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డి వారి గురవారెడ్డిని మిత్రులంతా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



## భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలవాలంటే

# ఉత్పాదకతే కీలకం

రచన: సీహెచ్. ప్రతాప్

భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన వృద్ధి దిశగా సాగుతోంది. 2025--26 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి 7.7 శాతంగా నమోదైంది. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల దేశీయోత్పత్తి విలువ సుమారు రూ.346.36 లక్షల కోట్లుకి చేరింది. ఈ గణాంకాలు భారత ఆర్థిక బలం పెరుగుతున్నదానికి సంకేతాలు. అయితే రాబోయే దశాబ్దంలో భారత్‌ను ప్రపంచంలోని అగ్ర ఆర్థిక శక్తుల సరసన నిలబెట్టాలంటే కేవలం అధిక వృద్ధిరేటు సరిపోదు. ప్రతి పెట్టుబడి, ప్రతి పని గంట, ప్రతి వనరుతో మరింత విలువను సృష్టించే ఉత్పాదకతే తదుపరి కీలక లక్ష్యం.

భారత ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం కీలక పాత్ర పోషిస్తోంది. అదే సమయంలో తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేయడం అత్యవసరం. 2025--26లో తయారీ, నిర్మాణ రంగాలు కలిపి ద్వితీయ రంగంలో సుమారు 7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. అధునాతన యంత్రసామగ్రి, నాణ్యమైన మౌలిక వసతులు, పరిశోధన, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి ద్వారా తయారీ రంగ ఉత్పాదకతను మరింత పెంచవచ్చు.

పెట్టుబడుల పరంగా కూడా భారత్ ముందుకు సాగుతోంది. 2025--26లో స్థిర మూలధన నిర్మాణం వాస్తవ పరంగా 7.8 శాతం పెరిగింది. తాజా అంచనాల ప్రకారం స్థిర మూలధన నిర్మాణం విలువ సుమారు రూ.110.64 లక్షల కోట్లుకి చేరింది. ఈ పెట్టుబడులు రహదారులు, రైల్వేలు, ఓడరేవులు, విద్యుత్తు, పరిశ్రమలు, డిజిటల్ మౌలిక వసతుల రూపంలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచేలా కొనసాగాలి.

భారత్ ముందున్న మరో పెద్ద అవకాశం యువ మానవ వనరులు. యువతకు విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందాలి. కృత్రిమ మేధ, రోబోటిక్స్, అర్ధవాహక పరికరాలు, ఆధునిక తయారీ, జీవసాంకేతికత, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో ప్రత్యేక శిక్షణ పెరిగితే అధిక విలువ కలిగిన ఉపాధి విస్తరిస్తుంది.

ఎగుమతుల విస్తరణ కూడా ఉత్పాదకతతో ముడిపడి ఉంది. ప్రపంచ మార్కెట్లలో దీర్ఘకాలిక పోటీ సామర్థ్యం కోసం ఉత్పత్తుల నాణ్యత, వ్యయ సామర్థ్యం, పరిశోధన, సరఫరా వ్యవస్థల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సాంకేతికత, రుణ సౌకర్యం, మార్కెట్లు అందుబాటులోకి వస్తే అవి దేశీయ ఉత్పత్తితో పాటు ఎగుమతుల్లోనూ కీలక పాత్ర పోషించగలవు.

భారత వృద్ధి ప్రయాణం ఇప్పుడు కొత్త దశలోకి ప్రవేశిస్తోంది. వినియోగాన్ని పెంచడం అవసరమే; కానీ ఉత్పాదకతను పెంచడం మరింత అవసరం. తక్కువ వనరులతో ఎక్కువ విలువను సృష్టించే ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపుదిద్దుకుంటే అధిక వృద్ధి, మెరుగైన ఉపాధి, పెరిగిన ఆదాయాలు, బలమైన ఎగుమతులు పరస్పరం బలపడతాయి. ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత ఎదుగుదలకు తదుపరి మెట్టు ఇదే.

# 1,053 కి.మీ. తీరరేఖ...
# ఆంధ్రప్రదేశ్ ప్రగతికి అపార అవకాశాలు

హెచ్. ప్రతాప్

**ఆంధ్రప్రదేశ్‌కు 1,053 కిలోమీటర్ల తీరరేఖ, 12 తీర జిల్లాలు, వందలాది మత్స్య ల్యాండింగ్ కేంద్రాలు, ఓడరేవులు, ఆక్వా రంగం వంటి అపార వనరులున్నాయి. 2024--25లో రాష్ట్రం నుంచి 3.66 లక్షల టన్నుల సముద్ర ఉత్పత్తులు సుమారు ₹21,246 కోట్ల విలువతో ఎగుమతయ్యాయి. ఈ గణాంకాలు రాష్ట్ర సముద్ర ఆర్థిక సామర్థ్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇప్పుడు ముడి వనరులకే పరిమితం కాకుండా వాటికి అధిక విలువ జోడించాల్సిన సమయం.**



2024లో రూపొందించిన సముద్ర విధానం--2030 ద్వారా ఓడరేవులు, తీర రవాణా, నౌకా నిర్మాణం, మత్స్య హార్బర్లు, సముద్ర పర్యాటకం, నైపుణ్యాభివృద్ధిని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యం ఉంది. తీరరేఖను కేవలం ఓడరేవుల వరుసగా కాకుండా సమగ్ర నీలి ఆర్థిక వ్యవస్థగా మార్చాలి.

మొదట మత్స్య హార్బర్లను ఆధునీకరించాలి. జువ్వలదిన్నె, ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం వంటి హార్బర్ల అభివృద్ధితో పాటు విశాఖ, కాకినాడ హార్బర్ల ఆధునీకరణ జరుగుతోంది. అయితే హార్బర్ నిర్మాణంతో ఆగకుండా హార్బర్--శీతల గిడ్డంగులు--ప్రాసెసింగ్--రవాణా--ఎగుమతి వ్యవస్థను ఒకే సమగ్ర గొలుసుగా తీర్చిదిద్దాలి.





కాకినాడ--అమలాపురాన్ని ఆక్వా ప్రాసెసింగ్ కేంద్రంగా, విశాఖ--పూడిమడకను సముద్ర సాంకేతికతకు, నెల్లూరు--జువ్వలదిన్నెను నౌకా నిర్మాణం, మరమ్మతులకు, బాపట్ల--నిజాంపట్నాన్ని విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులకు ప్రత్యేక కేంద్రాలుగా అభివృద్ధి చేయవచ్చు.

నౌకా నిర్మాణం మరో కీలక అవకాశం. దుగరాజపట్నంలో భారీ నౌకా నిర్మాణం, మరమ్మతుల సముదాయం ఏర్పాటైతే ఇంజినీరింగ్, సముద్ర పరికరాలు, నిర్వహణ, రవాణా వంటి అనుబంధ పరిశ్రమలకు కూడా ఊతం లభిస్తుంది.

విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, ములపేట ఓడరేవులను పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానించి తక్కువ వ్యయంతో సరకు రవాణా కోసం సముద్ర మార్గ వినియోగాన్ని పెంచాలి. ప్రతి తీర జిల్లాలో సముద్ర నైపుణ్య కేంద్రం, ప్రతి ప్రధాన హార్బర్‌లో శీతల గొలుసు, ప్రతి ఆక్వా ప్రాంతంలో విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.

అదే సమయంలో మడ అడవులు, తీర పర్యావరణం, కాలుష్య నియంత్రణ, మత్స్య సంపద పునరుత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలి. తీరరేఖను వనరుగా మాత్రమే కాకుండా ఉపాధి, ఎగుమతులు, పరిశ్రమలు, ప్రాంతీయ సమగ్ర అభివృద్ధికి ఇంజిన్‌గా మార్చడమే ఆంధ్రప్రదేశ్ నీలి ఆర్థిక వ్యవస్థకు తదుపరి అడుగు.

## ప్రపంచానికి ఇంధన స్వావలంబన దిశగా

# కొత్త ఆలోచన అవసరం

రచన: ప్రతాప్

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంధనం జీవనాడి. ముఖ్యంగా చమురు రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధి చుట్టూ నెలకొన్న తాజా ఉద్రిక్తతలు ప్రపంచానికి మరోసారి ఇంధన భద్రత ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తున్నాయి. ప్రపంచ చమురు, ద్రవ సహజవాయువు రవాణాలో దాదాపు ఐదో వంతు ఈ మార్గం గుండా సాగుతుండటంతో, ఇక్కడ ఏర్పడే అంతరాయం ప్రభావం ఒక్క ప్రాంతానికే పరిమితం కాదు. రవాణా ఖర్చులు, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక కార్యకలాపాలు, ద్రవ్యోల్బణం వరకు అనేక రంగాలపై దాని ప్రభావం పడుతుంది.**

అంతర్జాతీయ ఇంధన సంస్థ తాజా ఆగస్టు నివేదిక ప్రకారం, 2026లో ప్రపంచ చమురు సరఫరా రోజుకు 43 లక్షల బ్యారెళ్ల మేర తగ్గే అవకాశం ఉంది. మొత్తం సరఫరా రోజుకు సుమారు 10.202 కోట్ల బ్యారెళ్లకు పడిపోవచ్చని అంచనా. అదే సమయంలో అధిక ధరలు, సరఫరా అంతరాయాల కారణంగా ప్రపంచ చమురు వినియోగం కూడా రోజుకు 16 లక్షల బ్యారెళ్ల మేర తగ్గవచ్చని అంచనా వేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.





ఇంధన సరఫరాలో ఏర్పడిన ఒత్తిడి ఇప్పటికే ప్రపంచ నిల్వలపై ప్రభావం చూపుతోంది. జూలైలో ప్రపంచ చమురు సరఫరా కొంత కోలుకుని రోజుకు 10.15 కోట్ల బ్యారెళ్లకు చేరినప్పటికీ, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో అనిశ్చితి కొనసాగుతోంది. మరోవైపు చమురు నిల్వలు వేగంగా తగ్గడం భవిష్యత్ ధరలపై మరింత ఒత్తిడిని కలిగించే అవకాశం ఉంది.

ఈ పరిణామాలు భారతదేశానికి కూడా ముఖ్యమైన సందేశాన్ని ఇస్తున్నాయి. దేశ ఇంధన అవసరాల్లో చమురు దిగుమతుల వాటా అధికంగా ఉండటంతో అంతర్జాతీయ ధరల మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపగలవు. అందువల్ల ఒకే ప్రాంతం లేదా కొద్దిమంది సరఫరాదారులపై ఆధారపడకుండా దిగుమతి వనరులను మరింత విస్తరించడం అవసరం. ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి చమురు కొనుగోళ్లను పెంచడంతో పాటు దేశీయ శుద్ధి సామర్థ్యాన్ని సమర్థంగా వినియోగించుకోవాలి.

దీర్ఘకాలిక పరిష్కారం మాత్రం ఇంధన వనరుల వైవిధ్యీకరణలోనే ఉంది. దేశీయ చమురు, సహజవాయువు ఉత్పత్తిని పెంచడంతో పాటు సౌర, పవన, జల, అణు విద్యుత్ సామర్థ్యాలను విస్తరించాలి. విద్యుత్ వాహనాలు, హరిత ఇంధనాలు, శక్తి నిల్వ సాంకేతికతలను వేగంగా అభివృద్ధి చేయాలి. వ్యూహాత్మక చమురు నిల్వలను మరింత బలోపేతం చేయడం కూడా అవసరం.

హోర్ముజ్ సంక్షోభం తాత్కాలికంగా పరిష్కారమయ్యే అవకాశం ఉన్నప్పటికీ, అది ఇచ్చే పాఠం మాత్రం దీర్ఘకాలికం. ఇంధన భద్రత అంటే కేవలం చమురు నిల్వలు పెంచుకోవడం కాదు; అనేక వనరులు, అనేక సరఫరా మార్గాలు, బలమైన దేశీయ సామర్థ్యం కలిగిన సమతుల్య ఇంధన వ్యవస్థను నిర్మించడం. ప్రపంచం ఆ దిశగా అడుగులు వేస్తే భవిష్యత్తులో ఇంధన సంక్షోభాల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.




# పోలీస్ చట్టాలుపై అవగాహన కల్పించడానికే కార్డెన్ సర్చ్

**.శ్రీకాళహస్తి డిఎస్ పి నరసింహమూర్తి.**

**శ్రీకాళహస్తి, ఆగస్టు 16,జయ జయహే.**

పోలీస్ చట్టాలుపై అవగాహన కల్పించడానికే కార్డెన్ చర్చ్ నిర్వహిస్తున్నట్టు .శ్రీకాళహస్తి డిఎస్ పి నరసింహమూర్తి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ కోసం,శాంతి భద్రతల విషయమై ప్రజలకు భరోసా కల్పించడానికి, ప్రజలకు పోలీస్ చట్టాలుపై అవగాహన కల్పించడానికే శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని 155 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్ టి ఆర్ నగర్, కొండ మిట్ట ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారు జామున 5 గంటల నుంచి 7. 30 గంటల వరకు కార్డెన్ చర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్ పి మాట్లాడుతూ నేర ప్రవృత్తి చేసే వారి సంఖ్య ఎక్కువగా వున్న ప్రాంతంగా గుర్తించిన ఎన్ టి ఆర్ నగర్, కొండ మిట్ట ప్రాంతాల్లో కార్డెన్ చర్చ్ నిర్వహించామని, అనుమానిత వ్యక్తులు, రౌడీ షీటర్ల నివాసాలను తనిఖీ చేశామని తెలిపారు.అనుమానితులు, అనుమానిత వస్తువులు వివరాలు ,నేరాలకు పాల్పడేవారి వివరాలు పోలీసులుకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్డెన్ చర్చ్ లో 170 వాహనాలు, 10 ఆటోలను తనిఖీ చేసి ఎలాంటి రికార్డులు లేవని గుర్తించి పోలీస్ స్టేషన్ కు తరలించామన్నారు. సరైన రికార్డులు చూపితే వారి వాహనాలు ఇస్తామని లేకుంటే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే అఘాత్యాలను నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. గంజాయి విక్రయాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, తాము చేపడుతూ వున్న చర్యలు తెలిపామన్నారు. ఇప్పటికే 20 గంజాయి కేసులు నమోదు చేశామని,125 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 88 మందిని గంజాయి కేసులో అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. తరచూ గంజాయి విక్రయాలు చేస్తూ వున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.అలాగే మరో నలుగురు వ్యక్తులపై పిడి యాక్టు అమలు చేశామన్నారు.రోడ్డు ప్రమాధాల్లో అధికంగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, తగిన జాగ్రత్తలు తీసుకుని రోడ్డు భద్రతా నియమాలు పాటించి వాహనాలు నడపాలని కోరారు.

# శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేద్దాం





**- మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో వనాలు పెంచుదాం**

**- భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేద్దాం**

**- ప్రకృతి ఆధారంగా పంటలు పండించుదాం: డాక్టర్ మురళీమోహన్,**

**విశాఖపట్నం (జయ జయహే)**

శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేద్దాం, సామాజిక వనాలు పెంచుదాం అని ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ఏపీ స్టేట్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎం వి వి మురళి మోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం గ్రీన్ క్లైమేట్ టీం, వనమాలి, సి టి జి, మన కూరగాయల తోట సంస్థల నేతృత్వంలో తాటి పళ్ళు, విత్తనాల బంతులు, మామిడి టెంకలు, కొంకుడుకాయ, గంగ రావి, నేరేడు, సీతాఫలం తదితర రకాల విత్తనాలు మధురవాడ లోని ఎన్ వి పి లా కాలేజీ ఎదురుగా ఉన్న కొండల మీద విద్యార్థులతో చల్లిన తర్వాత ఆయన మాట్లాడారు. మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో వనాలు పెంచుదాం అని పిలుపునిచ్చారు. ఎల్ నినో, సూపర్ ఎల్ నినో నేపథ్యంలో వస్తున్న ప్రకృతి వైపరీత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన కృషి చేయాలని కోరారు. ప్రధానంగా శీతోష్ణస్థితి వేడెక్కకుండా ఉండడానికి సామాజిక వర్ణాలు పెంచడం ప్రతి ఒక్కరు బాధ్యత అన్నారు.

ఈ కార్యక్రమంలో విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు. రేపటి తరాన్ని పర్యావరణహితంగా జీవించేందుకు అవసరమైన అవగాహన కల్పించాలని కోరారు. అందుకే తాను తన మనవలకు పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన కల్పిస్తున్నామని, విత్తనాలు, విత్తనాలు బంతులు కొండల మీద విసిరేందుకు తీసుకువస్తున్నానన్నారు.

గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవి రత్నం మాట్లాడుతూ ప్రతి దేశ విత్తనం మొక్కై మొలకెత్తేందుకు కృషి చేయాలి అని కోరారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించుదాం అని , ఆ పంటలనే భుజిద్దామని పిలుపునిచ్చారు. తాటిపళ్ళతో తాటితోపులను పెంచుదాం అని కోరారు. మనం తినే పళ్ళ లోని విత్తనాలతో వనాలు పెంచుదాం అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం 100 విత్తనాల బంతులు తయారు చేసి కొండల మీద, మైదాన ప్రాంతాల్లో చల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్వా నేచురల్స్ మధుసూదన రెడ్డి, వనమాలి, సిటిజి, మనకూరగాయలతోట ప్రతినిధులు ఉష, కవిత,యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి తదితరులు 50 మందికి పైగా పాల్గొన్నార

# మొక్కలను నాటిన పౌర సంస్థలు

**డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్ణ సేన్ ఐఆర్ఏఎస్**

**గుంటూరు (జయ జయహే)**



గుంటూరులోని రైల్వే ఎకోపార్క్ లో నగరంలోని పౌర సంస్థలు ఐక్యమై వేలాది మొక్కలను నాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించడం అభినందనీయమని, ప్రజల భాగస్వామ్యంతోనే పచ్చదనాన్ని పెంపొందించగలమని డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్ణ సేన్ ఐఆర్ఏఎస్ పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన గుంటూరులోని రైల్వే ఎకోపార్క్ లో మానవత, శ్యామల నగర్ వాకర్స్ అసోసియేషన్, వు ఆర్ విత్ యు, కోవిడ్ ఫైటర్స్, సన్, చేయూత ఫౌండేషన్, నేస్తం, అభినందన ఫౌండేషన్, దిశా ఫౌండేషన్, రేట్ పేయర్స్ అసోసియేషన్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలను నాటుదాం - సంరక్షిద్దాం కార్యక్రమాన్ని రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేష్ణ సేన్ మొక్కలను స్వయంగా నాటి ప్రారంభించారు. సుదేష్ణ సేన్ ఐఆర్ఏఎస్ ప్రసంగిస్తూ గుంటూరు నగరంలోని రైల్వే ఎకో పార్క్ లో నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకుని మహా వృక్షాలుగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. చెట్లను అభివృద్ధి చేసుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు, భూసార రక్షణకు, భూగర్భ జలాలు పెంపుదలకు,సమృద్ధిగా వర్షాలు పడడానికి తోడ్పడతాయని జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తూ వన్యప్రాణుల రక్షణకు తోడ్పడతాయని తెలిపారు. చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ గుంటూరులోని పౌర సంస్థలన్నిశీటిని ఏకత్రాటిపైకి తెచ్చి గుంటూరు నగరంలో పచ్చదనం పెంపుదలకు కృషి చేస్తామని వివరించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి సమాజంలో 33 శాతం గ్రీనరి అవసరమైతే మన రాష్ట్రంలో 23 శాతం ఉందని, గుంటూరు జిల్లాలో 7 శాతం మాత్రమే గ్రీనరీ తో ఆంధ్రప్రదేశ్ లో అట్టడుగున ఉందని తెలిపారు. పచ్చని చెట్ల మధ్య సమయం గడిపితే మానసిక ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. ఎకోపార్కులో నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకునే బాధ్యతను పౌర సంస్థలు స్వీకరిస్తున్నాయని తెలిపారు . గుంటూరు జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మేనేజర్ నజీనా బేగం ప్రసంగిస్తూ 50వేల మొక్కలను నాటి పెంచగలిగితే ఒక డిగ్రీ ఫారన్ హీట్ ను తగ్గించగలమని తెలిపారు. నాటిన ప్రతి మొక్కకు నీటి సదుపాయం కల్పించి సంరక్షించుకుంటే ఉష్ణోగ్రతను మరింత తగ్గించుకొని వాతావరణ కాలుష్యాన్ని నివారించగలమన్నారు. మానవత సంస్థ జిల్లా చైర్మన్ పావులూరు రమేష్, వుయ్ ఆర్ విత్ యు వ్యవస్థాపకులు సిగినం అయ్యప్ప, శ్యామల నగర్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి వి. రాఘవరావు, అభినందన ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె. నిర్మల కుమార్ ప్రసంగించారు

# వైద్య ఆరోగ్యశాఖలో ఫ్రీజింగ్ ఎత్తివేసి పదోన్నతులు ఇవ్వాలి

**ఏపీజీఎంహెచ్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసచార్యులు**





**విశాఖపట్నం (జయ జయహే)**

ఉద్యోగుల విభజన ఇంకా పూర్తి అవ్వడానికి ఇంకా సమయం పడుతున్న నేపథ్యంలో ఫ్రీజింగ్‌ను ఎత్తివేసి వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులకు పదోన్నతలు కల్పించాలని ఏపీ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి బి. శ్రీనివాసాచార్యులు. సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు యం. వెంకటలక్ష్మిమలు డిమాండ్. చేశారు. సంఘం ప్రాంతీయ సమావేశం ఆదివారం మద్దిలపాలెంలో ఓప్రైవేట్ సమావేశం మందిరంలో జిల్లా అధ్యక్షుడు నగేష్ పట్నాయిక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో వ్యివిధ కేడర్ లలో చాలా ఖాళీలు వున్నాయి. కానీ వాటిపై జులై 15వ తేదీ నుంచి ఫ్రీజింగ్ విధించారన్నారు. అయితే విభజన వలన ఏ పోస్ట్ కూడా ముందుగా రద్దు చేసే వీలులేదని, గతంలో శాంక్షన్ అయిన అన్ని పోస్టులను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో 143 జీవోతో సంబంధం లేకుండా సీహెచ్‌వో మేల్,ఫీమేల్, ఎంపీహెచ్ఈవో,ఎంపీహెచ్ఎస్ మేల్,ఫీమేల్,ఎల్ఎస్ఎస్, డిప్యూటీ హెచ్ఈవో, డైటీషియన్ పోస్టులతోపాటు పరిపాలన విభాగంలో ఏవో,సూపరిండెంటెండ్ వంటి పోస్టులన్ని భర్తీ చేయాలన్నారు. అలాగే గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో వున్న సరెండర్ లీవ్ బకాయిలను విడుదలని వారు డిమాండ్ చేశారు.పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. మహిళా పారామెడికల్ ఉద్యోగులకు నిలిపివేసిన అడిషనల్ హెచ్ఆర్ఏ పునరుద్దించాలన్నారు. గత నాలుగేళ్లగా పారామెడికల్ ఉద్యోగులను ఇవ్వాల్సిన ఎఫ్‌టీఏ మంజూరు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులలో ఎంపీహెచ్ఏ (ఎం), ఎఫ్, ల్యాబ్‌టెక్నిషియన్‌లు, ఫార్మాసీ ఆఫీసర్ వంటి కేడర్‌ల ఉద్యోగులను రెగ్యులర్ ప్రక్రియ ప్రారంభించిందని దీన్ని వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి రా ష్ట్ర కార్యవర్గం లో ప్రాతినిద్యం వహిస్తున్న సహా అధ్యక్షులు నల్లి రవికుమార్. కోశాదికారిపై బందారు శ్రీనివాసరావు, ఉపాధ్యకుడు పొన్నాడ శేషుబాబు, ఎంఎస్‌వి.ప్రసాద్, ఏజే సత్యనారాయణ, పబ్లిసిటీ సెక్రటరీ నరసింహారావ్ (శివ), జాయింట్ సెక్రటరీ భవానీ, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి పీవైఎస్ రత్నం, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి పాడేర్రు జిల్లాల అధ్యక్ష్య, కార్యదర్శులు, మహిళా అధ్యక్షురాళు,ల విశాఖపట్నం సిటీ కార్యవర్గ సభ్యులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.



## హోమ్ మినిస్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న మురళి

**అనకాపల్లి జయ జయహే**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విధుల్లో దేవాదాయ శాఖలో సక్రమంగా ఉన్నతంగా విధులు నిర్వహించి పలువురు చేత ప్రశంసలు పొందిన అనకాపల్లి ఈవోగా అలాగే 47 దేవాలయాలకు విధులు నిర్వహిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళి కి దేవాదాయ ధర్మాదాయ శాఖ సిఫార్సుతో హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగింది అవార్డు రావడం పట్ల పలు వురు ఆయనకు అభినందనలు తెలియజేశారు భోగ లింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి పలు దేవాలయ సిబ్బంది ఆర్ శ్రీనివాసరావు జూనియర్ అసిస్టెంట్, అనపర్తి శంకర్రావు, మల్ల రామ్ గణేష్, కాండ్రేగులవెంకట రామారావు పలు దేవాలయాల అర్చకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు




## నిడదవోలు కమిషనర్ కృష్ణవేణికి ప్రశంసా పత్రం..

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. నిడదవోలు మున్సిపల్ కమిషనర్ టి.ఎల్.పి.ఎస్.ఎస్. కృష్ణవేణి 2026లో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా ఆమెకు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు పురపాలక సంఘానికి చెందిన డి. సత్యనారాయణ, డి. దావీదు రాజు, కే. కామేశ్వరి, జి.ఏ. సత్యనారాయణ, సిహెచ్. శ్రీవిద్యలకు కూడా ప్రశంసా పత్రాలు అందజేశారు.



## ఇంటింటికి కూటమి ప్రభుత్వం

**అరకులోయ: ఆగస్టు 16. జయ జయహే.**

అరకు వేలి మండలం చిన్నలబుడు పంచాయితీ దొరవలస గ్రామంలో స్థానిక టిడిపి పార్టీ అధ్యక్షులు పాంగి భగత్ రామ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించడం జరిగింది, అనంతరం సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీల సమర్ధ నాయకత్వంలో అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ అభివృద్ధి దూసుకుపోతుందని స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో అర్జున్ .రామారావు తదితరులు పాల్గొన్నారు,



## డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న శంకర్ రెడ్డి

**సత్యవేడు, ఆగస్టు 16,జయ జయహే.**

నారాయణవనం మండలంలో ఆదివారం నిర్వహించిన టీడీపీ డోర్ టూ డోర్ కార్యక్రమం లో సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి పాల్గొన్నారు.నారాయణవనం మండల పార్టీ అధ్యక్షులు గిరిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో అయన ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.కళ్యాణపురం పంచాయతీ లో చెరువుకట్ట పనులకు భూమి పూజ చేసి వడ్డిండ్లు కాలనీలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల సంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి,అందించిన పథకాలు గురించి వివరించి అక్కడ ప్రజల సమస్యలను తెలుసుకొని సమస్య పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కుమార్,మండల క్లస్టర్ ఇన్చార్జి షణ్ముగం,కో క్లస్టర్ బాల సుబ్రమణ్యం, యూనిట్ ఇన్చార్జిలు బాబు,పొన్నుస్వామి యాదవ్,మునివేలు,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోపి,గ్రామ కమిటీ అధ్యక్షులు మురళిలు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# విశాఖ చరిత్రలో ఆగస్టు 16 ఓ బ్లాక్ డే

### ఎయిర్ పోర్ట్ కొనసాగాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తా

### స్థానికులు ఉద్యోగాలు కోల్పోకుండా ఎంపీ శ్రీ భరత్ తో చర్చిస్తా

### ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు

**విశాఖపట్నం, ఆగస్టు 16, జయ జయహే :**



విశాఖ సాగర తీరం అందించిన ఆత్మీయ అనుభూతులతో విశాఖపట్నం విమానాశ్రయానికి ఆదివారం వీడ్కోలు పలికారు. విశాఖపట్నం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో విజయవాడకు బయలుదేరారు. విజయవాడలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయన ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎమ్మెల్యేలు కూన రవికుమార్, ఈశ్వర్ రావు, విజయ్ చంద్రుడు, మామిడి గోవిందరావు, అలాగే ఎమ్మెల్సీ గ్రీష్మ విజయవాడకు బయలుదేరిన వారిలో వున్నారు. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి బయలుదేరుతున్న సందర్భంగా, విశాఖ సాగరతీరం అందించిన అనుబంధాలు, ఆత్మీయ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ విమానాశ్రయానికి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు మాటాడుతూ చరిత్రలో ఈరోజు బ్లాక్ డేగా మిగిలిపోతుందన్నారు. మరికొన్ని గంటల్లో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి విమాన సేవలు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మారనున్న నేపథ్యంలో, విశాఖ విమానాశ్రయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన విశాఖ విమానాశ్రయం నుంచి సేవలు నిలిచిపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. విశాఖ విమానాశ్రయం నుంచి డొమెస్టిక్ విమాన సేవలు కొనసాగించేలా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. అదే విధంగా విశాఖ విమానాశ్రయంలో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది, హౌస్‌కీపింగ్ సిబ్బంది ఉపాధిపై విశాఖ ఎంపీ శ్రీ భరత్ తో చర్చిస్తానని చెప్పారు. వారి ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్‌లో విశాఖపట్నం విమానాశ్రయం నుంచే డొమెస్టిక్ విమాన సేవలు కొనసాగించే విధంగా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విశాఖ విమానాశ్రయంలో పనిచేస్తున్న స్థానిక సిబ్బంది ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పట్ల ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు.

# అనకాపల్లిలో వైశ్యుల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**అనకాపల్లి జయ జయహే**

ఆర్యవైశ్య మహాసభ అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం అనకాపల్లి పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఘనంగా జరిగింది ఈ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి రాజ్యసభ సభ్యులు ఆర్యవైశ్య మహాసభ చైర్మన్ టిజే వెంకటేష్ హాజరయ్యారు నూతన కార్యవర్గం ఎన్నికలు అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో ఆర్యవైశ్యుల ముందు ఉంటారని ఆర్యవైశ్యులకు ఎటువంటి కష్టం వచ్చిన టీజీ వెంకటేష్ ఉంటాడని అందరూ గుర్తుపెట్టుకోవాలని నేను ఆదుకోవడానికి ముందు ఉంటానని ఆయన అన్నారు అన్ని కులాలు మాదిరిగానే మనవాళ్లు కూడా ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని అన్నారు గతంలోని ఆర్యవైశ్యుల రాజకీయంగా చాలా ముందుండే వారిని అలాంటిది ఇప్పుడు రాజకీయంగా పూర్తిగా తగ్గిపోయారని ప్రతి ఒక్కరు రాజకీయాలో రాణించాలని ఆయన కోరారు ఆర్యవైశ్య పేద ఆర్యవైశ్యులకు విద్యా వైద్య రంగాల్లో పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన అన్నారు ఈ సందర్భంగా నూతన కమిటీని ఆయన అభినందించారు మహాత్మా గాంధీ పొట్టి శ్రీరాములు దేశ నాయకులని ఆయన అన్నారు మాజీ ముఖ్యమంత్రి రోశయ్య గారితో తనకు మంచి అనుబంధం ఉందని ఆర్యవైశ్య అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు జిల్లా ఆర్యవైశ య మహాసభ అధ్యక్ష కార్యదర్శులు గా ఎలమర్తి నర్సింగ్ రావు తమ్మన సుబ్రహ్మణ్యం గుప్తా ట్రెజరర్ గా గుండా రమేష్ గుప్తా జిల్లా మీడియా చైర్మన్ పోసర్ల రాజా వైస్ ప్రెసిడెంట్ జాయింట్ సెక్రటరీలు మెంబర్లు ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది అలాగే అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ సేవాదళ్ జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు త్వరలో మండల కమిటీలు కూడా ప్రమాణ స్వీకారం చేయిస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో మరో ముఖ్యఅతిథి తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి రత్నాకర్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య మాజీ అధ్యక్షులు చిన్న రామ సత్యనారాయణ స్టేట్ సెక్రటరీ మాటూరు రంగనాథ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొప్పు రావూరు రజిని స్టేట్ కోఆర్డినేటర్ కారుమూరి మహేష్ గౌరవ అధ్యక్షులు మాజీ అధ్యక్షులు జిల్లా మండల కమిటీ సభ్యులు జిల్లా నలుమూలల నుంచి సుమారు 750 మంది ఆర్యవైశ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# జిఎంఆర్ లబ్ధి కోసమే విశాఖ విమానాశ్రయం మూత

### సిపిఎం సీనియర్ నాయకులు నర్సింగ రావు

### ప్రభుత్వ ద్రోహంపై సిపిఎం నిరసన

### డొమిస్టిక్ ఎయిర్ పోర్ట్ గా విశాఖను కొన సాగించాలి

### భోగాపురం ఎయిర్ పోర్ట్ ఖర్చుపై జాయింట్ పార్ల మెంటరీ కమిటీ విచారణ

### సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

**విశాఖపట్నం, ఆగస్టు 16, జయ జయహే**




జిఎంఆర్ సంస్థ లాభాల కోసం సుదీర్ఘ చరిత్ర కల్గి సేవలందించిన విశాఖ ఎయిర్ పోర్ట్ ను ప్రభుత్వం శాశ్వతంగా మూసివేసి విశాఖ ప్రజలకు అన్యాయం చేస్తుందని సిపిఎం సీనియర్ నాయకులు సీహెచ్ నర్సింగరావు అన్నారు. ప్రభుత్వ సంస్థ ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు వచ్చిన భోగాపురం ఎయిర్ పోర్ట్ టెండర్ రద్దుచేసి, ప్రయివేటు జిఎంఆర్ సంస్థకు ప్రభుత్వాలు అప్పగించాయన్నారు. ఎయిర్ పోర్ట్ మూసివేతకు నిరసనగా, కూటమి ప్రభుత్వ ద్రోహం ఆపాలని సిపిఎం బ్లాక్ డే పిలుపులో భాగంగా ఆదివారం ఉదయం మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జాతీయ రహదారిలో పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉన్న విశాఖ విమానాశ్రయాన్ని మూసివేసి, కమీషన్ల కోసం జిఎంఆర్ కు ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతుందని అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ ను అంతర్జాతీయ విమానాశ్రయంగా కొనసాగించి, విశాఖను డొమిస్టిక్ ఎయిర్ పోర్ట్ గా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి గంగారావు, ఆర్ కె ఎస్ వి కుమార్ మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయంపై జిఎంఆర్ గుత్తాధిపత్యం కోసం ప్రభుత్వ విశాఖ ఎయిర్ పోర్ట్ మూసివేతకు కూటమి, మోడీ ప్రభుత్వాలు కుట్ర పన్నాయని విమర్శించారు. జిల్లాకు ఒక ఎయిర్ పోర్ట్ నిర్మిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, విశాఖలో 45 లక్షల మందికి పైగా ప్రయాణ సేవలు అందిస్తున్న విశాఖ విమానాశ్రయాన్ని ఎందుకు మూసివేస్తున్నారని ప్రశ్నించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి చేసిన రూ.5వేల కోట్లు ఖర్చులపై అనేక అనుమానాలున్నందున జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రూ.1500 కోట్లు ఖర్చుకాని భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి రూ.5వేలు ఖర్చు చేసినట్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. నిజాలు బయటకు రావాలంటే పార్లమెంటరీ కమిటీ విచారణ జరగాలన్నారు. భోగాపురం విమానాశ్రయంలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అంతర్జాతీయ నగరంగా విశాఖను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చి, విమానాశ్రయం లేని నగరంగా విశాఖను తయారుచేసి కూటమి ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేసిందన్నారు. జిఎంఆర్ సంస్థ లబ్ధి కోసం విశాఖ విమానాశ్రయం కొనసాగించాలని టీడీపీ, జనసేన, బిజెపి ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడడంలేదన్నారు. విశాఖ అభివృద్ధిని దెబ్బతీసి, విమాన ప్రయాణికులను కష్టపెడుతున్న ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి మణి, వి కృష్ణారావు, కెఎం శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎం సుబ్బారావు, వెంకటరావు, నరేంద్ర కుమార్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



## 'ఉత్తమ అసిస్టెంట్ లైన్‌మెన్'గా గంగాధర్

**పెందుర్తి, ఆగస్టు 16, జయ జయహే**

ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం పెందుర్తి సెక్షన్ పరిధిలో అసిస్టెంట్ లైన్‌మెన్ గా సేవలందిస్తున్న బీమాబత్తిన గంగాధర్ అద్భుతమైన పనితీరుతో 'ఉత్తమ అసిస్టెంట్ లైన్‌మెన్' అవార్డును కైవసం చేసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.శ్యాంబాబు శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గంగాధర్ కి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పెందుర్తి సెక్షన్ పరిధిలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంలో గంగాధర్ చూపుతున్న చొరవ ప్రత్యేకంగా అభినందించారు. విద్యుత్ అంతరాయాలు ఏర్పడినప్పుడు తక్షణమే స్పందించడం, వినియోగదారుల సమస్యలను ఓపికగా పరిష్కరించడం, విధి నిర్వహణలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడం వంటి అంశాలు ఆయనను ఈ పురస్కారానికి అర్హుడిగా నిలబెట్టాయి. ఆయన సేవలు, పనితీరును గుర్తించిన అధికారులు ఈ ప్రతిష్టాత్మక అవార్డుతో సత్కరించారు. పెందుర్తి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చొక్కాకుల కోటేశ్వరరావు మాట్లాడుతూ లైన్ మెన్ గంగాధర్ భవిష్యత్తులోనూ ఇదే అంకితభావంతో విధులు నిర్వహిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనకు లభించిన ఈ గుర్తింపు పెందుర్తి సెక్షన్ సిబ్బంది అందరికీ గర్వకారణమని పెందుర్తి అసిస్టెంట్ ఇంజనీర్ బి. రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెందుర్తి సెక్షన్‌కు చెందిన తోటి సిబ్బంది గంగాధర్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## జీవో నెంబర్.3ను పునరుద్ధరించే వరకు 389 పోస్టులను అర్హులైన గిరిజనులతోనే భర్తీ చేయాలి:

### సుజాత సల్మాన్ ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్.

**అరకులోయ: ఆగస్టు 16. జయ జయ**




గిరిజన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 389 విద్యా బోధకుల పోస్టులను అర్హత కలిగిన గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. జీవో నం.3 స్థానంలో గిరిజనుల రిజర్వేషన్ హక్కులను పరిరక్షించేలా నూతన జీవోను ప్రభుత్వం జారీ చేసి, గిరిజనులకు న్యాయం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, ఈ ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించిన సమాచారం మారుమూల గిరిజన గ్రామాల్లోని అర్హులైన అభ్యర్థులకు పూర్తిస్థాయిలో చేరలేదని ఆమె పేర్కొన్నారు. అందువల్ల అర్హులైన గిరిజన యువతకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించేందుకు దరఖాస్తు గడువును పొడిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## దివంగత ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులను పరామర్శ

**కిర్లంపూడి (జయ జయహే)**

కాపు ఉద్యమ నేత మాజీ మంత్రి దివంగత ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులను , మాజీ మంత్రి పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , ఎంపీ మిథున్ రెడ్డి కిర్లంపూడి లోని దివంగత పద్మనాభం నివాసంలో వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించడం జరిగింది. అనంతరంలి ముచ్చర్ల శ్రీరామ్ గారిలి ఆధ్వర్యంలో. లిపెద్దలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ని కలిసి పలు అంశాలపై వివరిస్తున్న, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు. ఆ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్. ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముచ్చర్ల శ్రీరామ్ , పెనుమంట్ర ఎంపీపీ కర్రీ వాసు రెడ్డి , కాజ మాజీ సర్పంచ్ పాలంకి శ్రీనివాస్ మానుకొండ శ్రీనుబాబు , డివిఎన్ రాజుగారు, ఇజ్జాడా చిన్న బాబు , బొంద మోహన్, మాజీ సర్పంచ్ వెంకటరమణ , పిల్లా సత్తిబాబు, కాసా ధనరాజు,, ఆకుల ప్రకాష్,, కొమ్ముల కాశీ,, అడ్డాల రామకృష్ణ , పాల్గొన్నారు

## శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో వైభవంగా ముగిసిన

# స్పిరిట్ ఆఫ్ ఇండిపెండెన్స్

### ముగిసిన రెండు రోజుల సాంకేతిక సాంస్కృతిక ప్రదర్శన

### ఆకట్టుకున్న బాలల ప్రదర్శన

**విశాఖపట్నం, ఆగస్టు 16, జయ జయహే**



భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శతవర్ష జన్మదినోత్సవ వేడుకలు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎంవీపీ శ్రీ సత్యసాయి విద్యావిహార్ లో శ్రీ సత్యసాయి నేషనల్ కౌన్సిల్ ఫర్ స్కూల్స్ మార్గదర్శకత్వంలో నిర్వహించిన "స్పిరిట్అఫ్ఇండిపెండెన్స్ -- ద్విదిన ప్రదర్శన--సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం స్ఫూర్తిదాయకమైన ముగింపు కార్యక్రమంతో విజయవంతంగా ముగిశాయి.

ఈ ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ విశాఖపట్నం మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపక సీఈఓ డా. జితేంద్ర శర్మ గౌరవ అతిథిగా విచ్చేసి కార్యక్రమానికి విశేష శోభను చేకూర్చారు. రెండు రోజుల కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా పాల్గొన్న శ్రీ సత్యసాయి నేషనల్ కౌన్సిల్ ఫర్ స్కూల్స్ కన్వీనర్ త్రిభువన్ సచ్‌దేవ్ కూడా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన అంకితభావంతో కూడిన కృషిని అభినందించారు. విలువలతో కూడిన విద్య పట్ల పాఠశాల చూపుతున్న నిబద్ధతను ప్రశంసిస్తూ, "స్వాతంత్ర్య స్ఫూర్తి"ని సజీవంగా ఆవిష్కరించడంలో విద్యార్థులు ప్రదర్శించిన సృజనాత్మకత, ఉత్సాహం, క్రమశిక్షణ, సమిష్టి కృషిని కొనియాడారు. విద్యార్థులను ఉద్దేశించి డా. జితేందర్ శర్మ మాట్లాడుతూ, "జీవితంలో ఏమి కావాలనుకుంటున్నాను?" అనే ప్రశ్నతో పాటు "ఎందుకు అది కావాలనుకుంటున్నారు " అని కూడా ఆలోచించాలని సూచించారు. శ్రీ సత్య సాయి విద్యా విహార్, విశాఖపట్నం విద్యతో పాటు నైతిక విలువలు, సంస్కారాలను అందిస్తున్న గొప్ప విద్యాసంస్థ అని ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను అభినందించారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తమ గురువులను ఎన్నటికీ మరచిపోవద్దని విద్యార్థులకు సూచించారు. రెండు రోజుల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 500 మంది విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన 170కి పైగా వినూత్న ఎగ్జిబిట్స్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల గవర్నింగ్ బాడీ సభ్యురాలు బి. శ్రీదేవి ముగింపు ప్రసంగంలో ఈ రెండు రోజుల కార్యక్రమం వెనుక ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి, సాధించిన విజయాలు, కార్యక్రమం యొక్క ప్రాధాన్యతను వివరించారు.

**విద్యా ప్రతిభకు సత్కారం...!**

విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అకాడమిక్ టాపర్స్ ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం ద్వారా సత్కరించారు. విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థుల కృషి, పట్టుదల, ప్రతిభను గుర్తించి వారికి అభినందనలు తెలిపారు. గౌరవ అతిథి డా. జితేంద్ర శర్మ అందించిన స్ఫూర్తిదాయక సందేశం కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రతిభతో పాటు బలమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొని, పాఠశాలలో నేర్చుకున్న విలువలను నిత్యజీవితంలో ఆచరించాలని ఆయన ప్రోత్సహించారు.

**300 మంది విద్యార్థులతో అద్భుత సాంస్కృతిక ప్రదర్శన**

అధికారిక కార్యక్రమాల అనంతరం 300 మంది విద్యార్థులతో నిర్వహించిన అద్భుత సాంస్కృతిక ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

"జయ దేవుని అష్టపదాలు"తో ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమం, "స్పిరిట్ అఫ్ ఇండిపెండెన్స్" ఇతివృత్తంలోని భౌతిక, మేధో, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం అనే మూడు ప్రధాన భావాలను నృత్యం, సంగీతం, భావప్రధాన అంశాల సమ్మేళనంతో అద్భుతంగా ఆవిష్కరించింది.

దేశం సాధించిన భౌతిక స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటం నుంచి మేధో చైతన్యోదయం, అక్కడి నుంచి ఆధ్యాత్మిక స్వేచ్ఛ కోసం చేసే అన్వేషణ వరకు విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా అర్థవంతమైన ప్రయాణాన్ని ఆవిష్కరించారు.

సమన్వయంతో కూడిన నృత్యాలు, భావవ్యక్తీకరణ, శక్తివంతమైన అంశ ప్రదర్శన ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలను అందుకున్నాయి. 300 మంది విద్యార్థుల భాగస్వామ్యంతో సాగిన ఈ సాంస్కృతిక ప్రదర్శన వారి ప్రతిభ, క్రమశిక్షణ, బృంద స్ఫూర్తి, ఆత్మవిశ్వాసానికి అద్భుత నిదర్శనంగా నిలిచింది.

ఈ ముగింపు కార్యక్రమంలో పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు మరియు పాఠశాల గవర్నింగ్ బాడీ సభ్యులు ఎ. కౌసల్య, శ్రీ సత్యసాయి విద్యావిహార్ పూర్వ ప్రిన్సిపాల్, శ్రీ సత్యసాయి నేషనల్ కౌన్సిల్ ఫర్ స్కూల్స్ సభ్యురాలు; బి. శ్రీదేవి, పాఠశాల గవర్నింగ్ బాడీ సభ్యురాలు; చెకూరి వరలక్ష్మి, ప్రిన్సిపాల్; ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే దీప్తి భగియా, యశ్వంత్, హెడ్ ఆఫ్ ఆపరేషన్స్, ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ సత్య, డా. జితేంద్ర శర్మ పర్సనల్ సెక్రటరీ , హాజరై కార్యక్రమానికి మరింత ఆత్మీయత, ప్రాధాన్యతను చేకూర్చారు.

రెండు రోజులపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సమిష్టి కృషితో సాగిన స్పిరిట్ అఫ్ఇండిపెండెన్స్ ప్రదర్శన--సాంస్కృతిక వేడుకలు దేశభక్తి, విలువల విద్య, సృజనాత్మకత, సంస్కృతి, సేవాభావాల సమ్మేళనంగా నిలిచి, ప్రతి ఒక్కరి హృదయంలో చిరస్థాయిగా నిలిచే ఒక స్ఫూర్తిదాయకమైన, అర్థవంతమైన, చిరస్మరణీయ వేడుకగా ఘనంగా ముగిశాయి.

# దౌర్జన్యంగా రైతుల భూములలో అర్ధరాత్రి రోడ్డు ఏర్పాటు



**నక్కపల్లి (జయ జయహే)**

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం బుచ్చి రాజు పేట రెవెన్యూ సర్వే నెంబర్లు 197,207 పరిధిలోని రైతు ల జిరాయితీ భూములలో ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా, రైతులు యొక్క అంగీకారం, ఆమోదం లేకుండా 2026 ఆగస్టు 14 అర్ధరాత్రి దేశం మొత్తం స్వాతంత్ర్య వేడుకలు నిర్వాహణకు సమాయత్తం అవుతున్న సందర్భంలో నక్కపల్లి మండలం, బుచ్చి రాజు పేట లో ఏపిఐఐసి అధికారుల బరితెగించి, చట్టాలను రాజ్యాంగాన్ని ఉల్లంఘించి రైతుల భూములలో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు లో భాగంగా రోడ్డు లు వేయడం జరిగింది. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు ఆదివారం బాధిత రైతులతో కలిసి రైతుల భూములలో ఏపిఐఐసి వారు రోడ్డు వేసిన ప్రాంతాన్ని పరిశీలించారు, ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ బుచ్చి రాజు పేట సర్వే నెంబర్లు 197,207 లలో బుచ్చి రాజు పేట, రాజయ్య పేట గ్రామాలకు చెందిన పది మంది రైతులకు చెందిన సుమారు 12 ఎకరాలు జిరాయితీ భూములను ప్రభుత్వం భూ సేకరణ చట్టం ప్రకారం భూములు సేకరణ చేయకుండా, రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా, రైతుల సాగులో ఉన్న భూములలో తోటలను ధ్వంసం చేసి, దౌర్జన్యం గా అక్రమంగా అర్ధ రాత్రి రోడ్డు వేయడం చట్ట విరుద్ధం, అధికారులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఈ విధంగా చట్టాలను రాజ్యాంగాన్ని ఉల్లంఘించి పనులు చేపట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు . డబ్ల్యూ పి 13471/ 2026 ప్రకారం రైతులు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో ఈ భూ సేకరణ పై కేసు వేశారని, కోర్టు కేసు ను కూడా గౌరవించ కుండా ఏపిఐఐసి అధికారులు రోడ్డు వేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో రైతులు టి.ప్రసాద్, టి.జగదీశ్వరరావు, సిహెచ్.కోదండ,ఎం.జాన్,పి.కోటి,వి.అప్పారావు,సి.హెచ్.మహాలక్ష్మి,వై.నూకమ్మ, ఎం .అచ్చారావు పాల్గొన్నారు

# ఘనంగా ముగిసిన గ్రామీణ యువజన మందిరం 62వ వార్షికోత్సవ ఉత్సవాలు

**మునగపాక, ఆగస్టు 16, జయ జయహే:**



మునగపాకలో ఘనంగా గ్రామీణ యువజన మందిరం 62వ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలు కనులవిందుగా జరిగాయి. వివిధ క్రీడల పోటీలు గ్రామ స్థాయి చెడు గుడు పోటీలు, తాడు లాగుట, చిత్రాలేకణం, చదరంగం, వాలీబాల్, మొదలగు క్రీడలు నిర్వహించటం జరిగింది. తదుపరి ఐ కిడ్స్ పిల్లలుచే కూచిపూడి మరియు బాలరామాయణం ప్రదర్శన, చిరంజీవి విల్లూరి దుహితచే క్లాసికల్ నృత్యం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నాలు మూలాలు నుండి కూడా ప్రజలు వచ్చి విక్షించటం జరిగింది. అలాగేయ్ ప్రముఖ విద్యావేత శ్రీ శిరిడి సాయి లా కాలేజీ అధినేత పెంటకోట వెంకట్రావుకి అత్యంత వైభవంగా సన్మానం కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ యువజన మందిరం క్రీడా విభాగం అధ్యక్షులుకి భారీగా సన్మాన కార్యక్రమం నిరహించటం జరిగింది. అనంతరం జరిగిన క్రీడాపోటిల్లో గేలుపొందిన వారికీ గ్రామ పెద్దలుచే బహుమతులు అందచేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ బొడ్డెడ ప్రసాద్, రాష్ట్ర గవర కోరపరేషన్ డైరెక్టర్ భీమారశెట్టి శ్రీనివాస్, దాడి మునిలినయుడు, కాళ్ళ జగ్గారావు, మల్ల సంజీవ్ మరియు కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఆంధ్రప్రదేశ్ డివిజనల్ ఫైనల్స్ పోటీలను ప్రారంభించిన శాప్ చైర్మన్ రవి నాయుడు

**తిరుపతి, ఆగస్టు 16,జయ జయహే.**

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర అగ్రికల్చర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈశా గ్రామోత్సవం ఆంధ్రప్రదేశ్ డివిజనల్ ఫైనల్ పోటీలను శాప్ చైర్మన్‌రవినాయుడుప్రారంభించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ ఈశా గ్రామోత్సవం ప్రధాన ఉద్దేశ్యం కేవలం క్రీడా పోటీలను నిర్వహించడం మాత్రమే కాదనిగ్రామీణ ప్రజల్లో ఉత్సాహాన్ని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని, భాగస్వామ్య భావనను, సామూహిక స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈశా గ్రామోత్సవానికి లభిస్తున్న స్పందన ఎంతో అద్భుతంగా ఉందని ఆయన తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 23 ప్రాంతాల్లో గ్రామోత్సవం నిర్వహించగా, మొత్తం 8,840 మంది గ్రామీణ క్రీడాకారులు పాల్గొనడంరాష్ట్రానికిగర్వకారణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని మరింత పెంపొందించేందుకు ఈశా గ్రామోత్సవం చేస్తున్న కృషి అభినందనీయమనిఈ కార్యక్రమం మరింత విస్తరించి రాష్ట్రంలోని మరెన్నో గ్రామాలకు చేరుకోవాలని అయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోటా వాసు , డాక్టర్ వి. చంద్రిక , ఈశా గ్రామోత్సవం నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



## ధ్యాన విద్య కోసం విద్యార్థులు అవగాహన క్యాంపు

**మునగపాక, ఆగస్టు 16, జయ జయహే:**

మునగపాక మండలంలోని నాగులపల్లిలో గల చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని కేడీపేట మండలానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మీనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు జగదీష్ విద్యార్థులును నాగులపల్లి గ్రామంలో ఉన్న చంద్ర శేఖర్ పిరమిడ్ ధ్యాన కేంద్రానికి తీసుకువచ్చి ధ్యాన కేంద్ర ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు సుజాత మేడం ధ్యాన కేంద్రం పర్యావరణ, పరిరక్షణ గురించి వారికి అవగాహన కల్పించడంతోపాటు, పుస్తక పఠనం ప్రాధాన్యత నిరంతర ధ్యానం వల్ల చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు ఏకాగ్రత కలుగుతుందని, వ్యక్తిగత అభివృద్ధి జరుగుతుందని వివరించారు. సుమారు 40 మంది విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కేంద్రానికి వచ్చిన వారందరికీ ఉచితంగా ధ్యానం గురించి తెలియజేసే పుస్తకాలు, మొక్కలు సుజాత అందజేశారు.



## బండ్ల గణేశ్ కుమార్తె వివాహం

### సతీసమేతంగా హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు..

### ఆనందంతో ఏడ్చేసిన బండ్ల గణేశ్

**హైదరాబాద్, జయ జయహే:**

ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఇంట పెళ్లి బాజాలు మోగాయి. ఆయన కుమార్తె జనని వివాహం ఆదివారం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఆమె ఏడడుగులు వేశారు. ఈ వివాహ వేడుకకు రాజకీయ, సినీ రంగాలకు చెందిన అగ్ర ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులు జనని, సూర్య తేజ వద్దకు వెళ్లి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ, బండ్ల గణేశ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన కుమార్తె పెళ్లి వేడుకకు చంద్రబాబు సతీసమేతంగా రావడం పట్ల బండ్ల గణేశ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఓ దశలో ఏడ్చేశారు. దాంతో పక్కనే ఉన్న సీనియర్ నటుడు బ్రహ్మాజీ ఆయనను ఊరడించారు. కాగా, వరుడు సూర్యతేజ సీఎం చంద్రబాబు-నారా భువనేశ్వరిల చేతులమీదుగా తాళి అందుకుని వధువు మెడలో మంగళ సూత్రధారణ చేయడం విశేషం. బండ్ల గణేశ్ కు సినీ, రాజకీయ రంగాల్లో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో, ఈ వివాహ వేడుకకు ఇరు రంగాలకు చెందిన నాయకులు, నటీనటులు, నిర్మాతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి రాకతో వివాహ ప్రాంగణం సందడిగా మారింది. అతిథులను బండ్ల గణేశ్ దంపతులు సాదరంగా ఆహ్వానించి, వారి బాగోగులు చూసుకున్నారు. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

For a pure tomorrow.. జయహో

# నేటితో 4 దశాబ్దాల విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో

# పౌర విమానాలకు బ్రేకులు

## దారి మళ్లిన విమాన ప్రయాణీకులు

### మూత బడ్డ విశాఖ విమానాశ్రయ ద్వారం... అల్లంత దూరాన భోగాపురం విమానాశ్రయం



**విశాఖ నగరం ఒక కొత్త అంతర్జాతీయ విమానాశ్రయాన్ని స్వాగతించాల్సిన వేళ, నగర ప్రజల మనసుల్లో మాత్రం ఒక ప్రశ్న, ఒక ఆవేదన, ఒక అసంతృప్తి బలంగా వినిపిస్తోంది. ఆధునిక సౌకర్యాలతో, భారీ సామర్థ్యంతో, అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం భవిష్యత్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక పెద్ద ముందడుగు కావచ్చు. కానీ విశాఖ వాసుల దృష్టిలో మాత్రం అది ఒక అసౌకర్యకరమైన వాస్తవాన్ని ముందుకు తెచ్చింది. విమానాశ్రయం ఆధునికమైంది, కానీ దాన్ని చేరుకోవడం మాత్రం మరింత కష్టమైంది.విశాఖ నగరానికి అత్యంత సౌకర్యంగా ఉన్న ప్రస్తుత విమానాశ్రయం నుంచి విమాన సేవలు పూర్తిగా భోగాపురానికి మారిపోవడం నగర ప్రజల్లో విస్తృత అసంతృప్తికి కారణమవుతోంది.**

(జయ జయహే - ప్రత్యేక ప్రతినిధి)

ఎందుకంటే విమాన ప్రయాణం అంటే కేవలం విమానం ఎక్కడం కాదు. ఇంటి నుంచి విమానాశ్రయానికి చేరుకునే ప్రయాణం కూడా దానిలో అంతర్భాగమే. ఆ ప్రయాణమే ఎక్కువ సమయం, ఎక్కువ డబ్బు, ఎక్కువ అనిశ్చితితో కూడుకున్నప్పుడు, విమాన ప్రయాణం అందించే సౌకర్యం కొంతవరకు కోల్పోతుంది. ఈ ఆందోళనలను కేవలం ప్రజల అభిప్రాయంగా కొట్టిపారేయలేం. సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్, అంటే సిడార్, నిర్వహించిన అధ్యయనం విశాఖ-భోగాపురం అనుసంధానంపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భోగాపురం వైపు నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలు, వాస్తవ సమయ రవాణా సమాచారాన్ని ఆధారంగా చేసుకుని చేసిన అధ్యయనంలో కొమ్మాది, ఎండాడ, బోయపాలెం, ఆనందపురం ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీని గుర్తించింది. నగర కేంద్రం నుంచి ఆనందపురం చేరుకోవడానికే గంటకు పైగా సమయం పడుతున్న పరిస్థితి ఉందని, అక్కడి నుంచి విమానాశ్రయానికి మరో 20-25 నిమిషాల ప్రయాణం అవసరమవుతోందని అధ్యయనం వెల్లడించింది. అంటే విమానాశ్రయం దూరం మాత్రమే సమస్య కాదు, దానికి వెళ్లే మార్గంలో నగర రద్దీనే అసలు బలహీనంగా మారుతోంది.

సిడార్ అధ్యయనం మరొక కీలక విషయాన్ని కూడా స్పష్టం చేసింది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భోగాపురం వరకు సుమారు 50 కిలోమీటర్ల దూరాన్ని చేరుకోవడానికి ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపు 105 నిమిషాల సమయం పడుతోంది. ఒక విమానాశ్రయానికి చేరుకోవడానికి గంటన్నర నుంచి రెండు గంటల వరకు పట్టే పరిస్థితి ఏర్పడితే, విమాన ప్రయాణం అందించే వేగం కంటే విమానాశ్రయానికి చేరుకునే రహదారి ప్రయాణమే ఎక్కువ భారంగా మారుతుంది. ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. భోగాపురం ఎయిర్‌పోర్టు విశాఖ నుంచి సుమారు 45-50 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పాటు, ప్రస్తుత మార్గంలో అనేక ట్రాఫిక్ సిగ్నల్లు, పీక్ అవర్ రద్దీ, పరిమిత ప్రజా రవాణా కారణంగా నగరం నుంచి విమానాశ్రయానికి 75 నుంచి 120 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొంది. రెండు గంటల వరకు ప్రయాణ సమయం పెరగవచ్చునే ఆందోళన కూడా వ్యక్తమైంది.

ఇది సాధారణ ప్రయాణికుడికి ఎంత పెద్ద భారం అన్నది ఒకసారి ఆలోచించాలి. విమానం ఉదయం ఏడు గంటలకు ఉంటే, ప్రయాణికుడు విమానాశ్రయంలో తనిఖీలు, భద్రతా ప్రక్రియలు పూర్తి చేసుకునేందుకు కనీసం రెండు గంటల ముందే అక్కడ ఉండాలి. దీనికి తోడు నగరం నుంచి భోగాపురానికి చేరుకోవడానికి గంటన్నర లేదా అంతకంటే ఎక్కువ సమయం అవసరమైతే, తెల్లవారుజామునే ఇంటి నుంచి బయలుదేరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రాత్రి విమానం అయితే తిరిగి ఇంటికి చేరుకునే సమయానికి







మరో సుదీర్ఘ రహదారి ప్రయాణం ఎదురవుతుంది. విమానం మూడు గంటల్లో ఒక నగరం నుంచి మరో నగరానికి తీసుకెళ్లినా, ఇంటి నుంచి విమానాశ్రయానికి వెళ్లడానికి గంటన్నర, రెండు గంటలు పడితే ఆ ప్రయాణం మొత్తం అనుభవంలో అసౌకర్యం తప్పదు.

ఇక్కడ మరో ముఖ్యమైన అంశం రవాణా ఖర్చు. భోగాపురం వరకు టాక్సీ ప్రయాణానికి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక వైపు ప్రయాణానికే వందల నుంచి వేల రూపాయల వరకు ఖర్చు అయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. కుటుంబంతో ప్రయాణించే వారికి ఈ భారం మరింత పెరుగుతుంది. విమాన టికెట్ ధరతో పోలిస్తే విమానాశ్రయానికి వెళ్లి రావడానికి అయ్యే ఖర్చు గణనీయంగా పెరిగితే, విమాన ప్రయాణం మధ్యతరగతి కుటుంబాలకు కూడా అదనపు ఆర్థిక భారంగా మారుతుంది.

ప్రజా రవాణా విషయంలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం స్వాగతించదగిన చర్యే. అయితే సమస్య కేవలం బస్సులు ఉన్నాయా లేదా అన్నది కాదు. విమానాశ్రయానికి వెళ్లే ప్రతి విమాన సమయానికి సరిపోయే విధంగా 24 గంటలూ, అధిక పౌనఃపున్యంతో, ఆలస్యం లేకుండా, సరసమైన ధరకు ప్రజా రవాణా అందుబాటులో ఉండాలి. విమానాశ్రయానికి చేరుకోవడానికి చివరి దశ రవాణా వ్యవస్థ బలంగా లేకపోతే అత్యాధునిక టెర్మినల్ కూడా ప్రయాణికుడికి పూర్తి సౌకర్యాన్ని ఇవ్వదు.

అత్యంత ఆందోళన కలిగించే అంశం రహదారి అనుసంధానం. భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా పలు కీలక రహదారులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏర్పడటం, విమానాశ్రయం నిర్మాణంతో పాటు దానికి అనుసంధానమయ్యే రవాణా మౌలిక వసతులను కూడా సమాంతరంగా పూర్తి చేయాల్సిన పరిస్థితిని స్పష్టం చేస్తోంది. విమానాశ్రయం నిర్మాణం పూర్తయిందంటే ప్రయాణికుల సమస్యలు పరిష్కారమైనట్లుకాదు. విమానాశ్రయానికి చేరుకునే మార్గాలు కూడా సమర్థవంతంగా పనిచేయాలి.

ఇదే విషయాన్ని సిడార్ మరో కోణంలో చూపించింది. సమస్య కేవలం ప్రయాణ సమయం మాత్రమే కాదు; రద్దీ ప్రాంతాల్లో వాహనాల కాలుష్యం కూడా పెరుగుతోంది. కొమ్మాది, ఎండాడ, బోయపాలెం, ఆనందపురం వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ కారణంగా వాయు కాలుష్యం పెరిగే ప్రమాదం ఉంది. అంటే కొత్త విమానాశ్రయం కోసం పెరుగుతున్న రోడ్డు రవాణా నగరంపై మరో పర్యావరణ భారాన్ని కూడా మోపవచ్చు.

ఇక్కడే సిడార్ సూచించిన ప్రత్యామ్నాయ ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంటుంది. విశాఖ ఒక తీర నగరం. కాబట్టి విమానాశ్రయ అనుసంధానాన్ని కేవలం రహదారులపైనే ఆధారపరచకుండా సముద్ర మార్గాన్ని కూడా పరిశీలించాలని సిడార్ సూచించింది. బయటి నౌకాశ్రయం వద్ద సముద్ర రవాణా కోసం ప్రత్యేక ప్రయాణికుల కేంద్రాన్ని ఏర్పాటు చేసి, వేగవంతమైన సముద్ర రవాణాను ప్రత్యామ్నాయంగా ఉపయోగించే అవకాశాన్ని పరిశీలించాలని పేర్కొంది. భవిష్యత్తులో మెట్రో, ప్రత్యేక తీర రహదారి, సముద్ర రవాణా వంటి పలు మార్గాలను సమన్వయం చేయడం ద్వారా భోగాపురం సమస్యకు సమగ్ర పరిష్కారం సాధ్యమవుతుంది. అయితే ఈ సమస్యలన్నింటికంటే విశాఖ వాసుల మనసును ఎక్కువగా కలిచివేస్తున్న అంశం ప్రస్తుత విమానాశ్రయం మూసివేత.

నగరానికి దగ్గరగా ఉన్న ప్రస్తుత విమానాశ్రయం ఎన్నో సంవత్సరాలుగా విశాఖకు విమాన ద్వారంగా పనిచేసింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తక్కువ సమయంలో అక్కడికి చేరుకోవచ్చు. టాక్సీ ఖర్చు తక్కువగా ఉంటుంది. వ్యక్తిగత వాహనాలతో వెళ్లడం సులభం. వృద్ధులు, పిల్లలు, వైద్య అవసరాలున్న వారు సులభంగా ప్రయాణించగలిగేవారు. అత్యవసరంగా విమానం ఎక్కాల్సి వచ్చినా విమానాశ్రయానికి చేరుకోవడం సాధ్యమయ్యేది. అవును, ఆ విమానాశ్రయానికి నౌకాదళ పరిమితులు ఉన్నాయి. విమానాల రాకపోకలకు సమయ పరిమితులు ఉన్నాయి. విమానాల విస్తరణకు పరిమితులు ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయి విస్తరణకు కూడా అనేక అడ్డంకులు ఉన్నాయి. అందుకే భోగాపురం వంటి భారీ సామర్థ్యం కలిగిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అవసరం వచ్చింది. ఈ వాస్తవాన్ని ఎవరూ తిరస్కరించలేరు.

కానీ ఒక ప్రశ్న మాత్రం మిగిలిపోతుంది. భోగాపురం పూర్తిస్థాయి రవాణా అనుసంధాన వ్యవస్థ సిద్ధమయ్యే వరకు ప్రస్తుత విమానాశ్రయాన్ని కొన్ని సంవత్సరాలు కొనసాగించి ఉండలేమా? ఇదే ప్రశ్నకు ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ కూడా మధ్యంతర పరిష్కారంగా ప్రస్తుత విమానాశ్రయం నుంచి పరిమిత విమాన సేవలను కొనసాగించాలని సూచించింది. ముఖ్యంగా తెల్లవారుజామున, రాత్రివేళల్లో కొన్ని విమానాలను ప్రస్తుత విమానాశ్రయం నుంచే నడిపితే నగర ప్రజలకు గణనీయమైన ఉపశమనం లభించేదని ప్రతిపాదించింది.

ఇలాంటి ద్వంద్వ విమానాశ్రయ వ్యవస్థ విశాఖ ప్రజలకు ఒక విలువైన ఎంపికను ఇచ్చేది. ఉత్తర విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన వారు




భోగాపురాన్ని ఉపయోగించుకోవచ్చు. నగర కేంద్రం, దక్షిణ విశాఖ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ప్రయాణ సమయం, విమాన సమయం, ఖర్చు, కుటుంబ పరిస్థితులను బట్టి ప్రస్తుత విమానాశ్రయాన్ని ఎంచుకునే అవకాశం ఉండేది.

**అది కేవలం సౌకర్యం కాదు. అది ప్రయాణికుడి ఎంపిక హక్కు.**

ప్రస్తుత విమానాశ్రయం నుంచి భోగాపురానికి పౌర విమాన సేవలను పూర్తిగా మార్చడం వల్ల ఆ ఎంపిక ఇప్పుడు లేకుండా పోయింది. ఒకప్పుడు నగరానికి అతి సమీపంలో ఉన్న విమానాశ్రయాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉన్న విశాఖ వాసులు, ఇప్పుడు తమ విమాన ప్రయాణానికి ముందు మరో సుదీర్ఘ రహదారి ప్రయాణాన్ని తప్పనిసరిగా స్వీకరించాల్సిన పరిస్థితిలోకి వచ్చారు.

**ఇక్కడే విశాఖ ప్రజల గుండెల్లో ఏర్పడిన బాధను అర్థం చేసుకోవాలి.**

వారు భోగాపురాన్ని వ్యతిరేకించడం లేదు. వారు అభివృద్ధిని వ్యతిరేకించడం లేదు. వారు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కోరుకోవడం లేదనడం కూడా సరికాదు. వారి ఆవేదన ఒక్కటే---తమకు ఎన్నేళ్లుగా ఉన్న సౌకర్యవంతమైన విమానాశ్రయాన్ని కోల్పోయి, దానికి బదులుగా నగరానికి దూరంగా ఉన్న విమానాశ్రయాన్ని ఉపయోగించాల్సి రావడం.

భోగాపురం ఉత్తరాంధ్రకు భవిష్యత్తు కావచ్చు. కానీ విశాఖ నగరానికి అది వర్తమానంలో భారంగా మారకూడదు.

విమానాశ్రయం ఆధునికంగా ఉండటం ఎంత ముఖ్యమో, దానికి చేరుకునే మార్గం కూడా అంతే సులభంగా ఉండాలి. విమానాశ్రయం పెద్దదిగా ఉండటం ఎంత ముఖ్యమో, అక్కడికి వెళ్లే ప్రయాణికుడి సమయం, డబ్బు, శ్రమ కూడా అంతే విలువైనవి. ఒక విమాన ప్రయాణం కోసం ప్రయాణికుడు తన ఇంటి నుంచి మూడు, నాలుగు గంటల ముందే బయలుదేరాల్సి వస్తే, ఆ ప్రయాణంలో విమాన వేగం కంటే రహదారి నెమ్మదితనం ఎక్కువగా ప్రభావం చూపుతుంది.

అందుకే ఇప్పుడు అవసరమైనది విమానాశ్రయాన్ని విమర్శించడం కాదు; దాని అనుసంధానాన్ని అత్యవసర ప్రాధాన్యంగా చూడటం. ప్రత్యేక విమానాశ్రయ రహదారులు, రద్దీ రహిత రవాణా కారిడార్లు, 24 గంటల ప్రజా రవాణా, నియంత్రిత టాక్సీ చార్జీలు, వేగవంతమైన రవాణా వ్యవస్థ, మెట్రో అనుసంధానం, భవిష్యత్తులో సముద్ర రవాణా వంటి ప్రత్యామ్నాయాలను సమగ్రంగా అమలు చేయాలి.

అంతకంటే ముఖ్యంగా, సాధ్యమైన అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తూ ప్రస్తుత విమానాశ్రయాన్ని పరిమిత సేవలతోనైనా కొనసాగించే అవకాశాన్ని కూడా పునఃపరిశీలించాల్సిన అవసరం ఉంది.

భోగాపురం పూర్తిస్థాయి రవాణా వ్యవస్థతో స్థిరపడే వరకు రెండు విమానాశ్రయాల మధ్య కొంతకాలం సమన్వయ వ్యవస్థ ఉంటే, అది ప్రయాణికులకు ఎంపికను ఇస్తుంది, రహదారులపై ఒత్తిడిని తగ్గిస్తుంది, రవాణా ఖర్చును నియంత్రిస్తుంది, అత్యవసర మరియు రాత్రివేళ ప్రయాణాలకు భరోసా కల్పిస్తుంది. ఎందుకంటే నగరానికి దగ్గరగా ఉన్న ఒక విమానాశ్రయం అనేది కేవలం రన్‌వే, టెర్మినల్, విమానాల సమాహారం కాదు. అది నగర జీవన విధానంలో భాగం. అది వ్యాపారవేత్తకు సమయం, వృద్ధుడికి సౌకర్యం, రోగికి ఉపశమనం, కుటుంబానికి భద్రత, అత్యవసర ప్రయాణికుడికి ఒక భరోసా.

**విశాఖ వాసుల మనసులో ఉన్న బాధను ఒక వాక్యంలో చెప్పాలంటే..**

భోగాపురం వారికి కొత్త విమానాశ్రయాన్ని ఇచ్చింది; కానీ వారి నగరానికి దగ్గరగా ఉన్న విమాన ప్రయాణ సౌకర్యాన్ని తీసుకుపోయింది. అభివృద్ధి అంటే ఒక సౌకర్యాన్ని నిర్మించి మరో సౌకర్యాన్ని కోల్పోవడం కాదు. అభివృద్ధి అంటే ప్రజలకు మరింత ఎంపిక, మరింత సౌకర్యం, తక్కువ ఖర్చు, తక్కువ సమయం, మెరుగైన జీవన నాణ్యత అందించడం.

భోగాపురం నిజమైన ప్రజా విజయంగా నిలవాలంటే, ఆ విమానాశ్రయానికి చేరుకోవడమే మరో పరీక్ష కాకూడదు.

## వైజాగ్ ఎయిర్‌పోర్ట్ ఖాళీ.. కార్మికుల కన్నీళ్లు



ఈ అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ సేవలు రద్దు కానున్నాయి. 10.45 PMకి లాస్ట్ ఫ్లైట్ ఢిల్లీకి వెళ్లనుంది. దీంతో అక్కడి వస్తువులను సిబ్బంది తరలిస్తున్నారు. ఇన్నాళ్లుగా అక్కడ పనిచేసిన కార్మికులు తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. ఇకపై విశాఖలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, పోలీసు విమానాలు, గవర్నమెంట్ గెస్టుల ఫ్లైట్లు, నాన్ షెడ్యూల్డ్ కమర్షియల్ కార్య కలాపాలు మాత్రమే కొనసాగనున్నాయి.




## విశాఖ చరిత్రలో ఆగష్టు 16 ఓ బ్లాక్ డే

### ఎయిర్ పోర్ట్ కొనసాగాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తా

### స్థానికులు ఉద్యోగాలు కోల్పోకుండా ఎంపీ శ్రీ భరత్ తో చర్చిస్తా

### ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు



విశాఖ సాగర తీరం అందించిన ఆత్మీయ అనుభూతులతో విశాఖపట్నం విమానాశ్రయానికి ఆదివారం వీడ్కోలు పలికారు. విశాఖపట్నం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో విజయవాడకు బయలుదేరారు. విజయవాడలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయన ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎమ్మెల్యేలు కూన రవికుమార్, ఈశ్వర్ రావు, విజయ్ చంద్రుడు, మామిడి గోవిందరావు, అలాగే ఎమ్మెల్సీ గ్రీష్మ విజయవాడకు బయలుదేరిన వారిలో వున్నారు. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి బయలుదేరుతున్న సందర్భంగా, విశాఖ సాగరతీరం అందించిన అనుబంధాలు, ఆత్మీయ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ విమానాశ్రయానికి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు మాటాడుతూ చరిత్రలో ఈరోజు బ్లాక్ డేగా మిగిలిపోతుందన్నారు. మరికొన్ని గంటల్లో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి విమాన సేవలు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మారనున్న నేపథ్యంలో, విశాఖ విమానాశ్రయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన విశాఖ విమానాశ్రయం నుంచి సేవలు నిలిచిపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. విశాఖ విమానాశ్రయం నుంచి డొమెస్టిక్ విమాన సేవలు కొనసాగించేలా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు.



అదే విధంగా విశాఖ విమానాశ్రయంలో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది, హౌస్‌కీపింగ్ సిబ్బంది ఉపాధిపై విశాఖ ఎంపీ శ్రీ భరత్ తో చర్చిస్తానని చెప్పారు. వారి ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్‌లో విశాఖపట్నం విమానాశ్రయం నుంచే డొమెస్టిక్ విమాన సేవలు కొనసాగించే విధంగా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విశాఖ విమానాశ్రయంలో పనిచేస్తున్న స్థానిక సిబ్బంది ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పట్ల ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com